హైదరాబాద్ వార్త



# ఇంటింటికి పత్రికలు చేరవేసిన ఎంఎస్ ఆచార్య

**ముషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** డాక్టర్ మాడభూషి శ్రీధర్ రచించిన ఎం.ఎస్.ఆచార్య పుస్తకం ఆనాటి తెలంగాణ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా ఉందని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ఎం.ఎస్.ఆచార్య పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు సీనియర్ పాత్రికేయులు, పుస్తక రచయిత మాడభూషి శ్రీధర్, వల్లీశ్వర్, గోపరాజు, వినయ్‌కమార్, పాశం యాదగిరి, శ్రీనివాస్, ఎంపీపీ జాయింట్ సెక్రటరీ శ్యాం ప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం కాలంలోనే వరంగల్‌లో ఒక పత్రికను నడపటమే కాకుండా ఇంటింటికి పత్రికలను అందచేసిన ధైర్యశాలి ఎం.ఎస్.ఆచార్య అని కొనియాడారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సీనియర్ పాత్రికేయులు ఎం.ఎస్.ఆచార్య విగ్రహం గోపాలపల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో త్వరలో ఏర్పాటుచేసుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా పుస్తక రచయిత మాడభూషి శ్రీధర్ కూడా తన కలం ద్వారా సమాజంలోని, ప్రభుత్వంలోని లోపాలను ఎత్తి చూపుతూ ప్రశ్నించటం అభినందనీయమని కొనియాడారు.



ఎం.ఎస్.ఆచార్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

# ఆస్పత్రులలో కనిపించని ఉచిత అంబులెన్స్‌లు

**-మానవత్వాన్ని మరుస్తున్న అంబులెన్స్ డ్రైవర్‌లు -మృతదేహాలను తరలించడానికి ఉచిత వాహన సదుపాయం ఉన్నా..లేనట్లే**

**హైదరాబాద్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:** రోగాల బారిన పడిన పేద ప్రజలు కొన్నిసార్లు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రహించాలంటే కూడా జంకుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రహిస్తే ఆస్తులు అమ్ముకోవాలనే భయం ఉంటుంది. కాని ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రహిస్తే భయం ఎందుకనే సందేహం కలగవచ్చు. కాని ఇదే నిజం. కుటుంబ సభ్యులలో ఎవరైనా తీవ్రమైన జబ్బు బారిన పడితే ప్రాణాలు దక్కుతాయో లేదో అనే సందేహం ఉన్నప్పుడు దూర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులకు తరలించాలంటే జంకుతున్నారు. రోగిని ఇంటివద్దే ఉంచుకొని వైద్యం చేయిస్తున్నారు. దురదృష్టవశాత్తు మృతి చెందితే అక్కడే అత్యక్రియలు జరిపించుకుంటున్నారు. ఇదంతా ఎందుకంటే ప్రాణాలను కాపాడుకోడానికి నిరుపేదలు దూర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి వైద్యం చేయిస్తే ప్రాణాలు దక్కితే పరవాలేదు. ప్రాణాలు పోతే మాత్రం మృతదేహాన్ని సొంతూరికి తరలించాలంటే మాత్రం నిరుపేదలు భరించలేదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతంత ఖర్చును భరించడం నిరుపేదలకు ఆస్తులు అమ్ముకోవడంతో సమానమే. వేలకు వేలు ఖర్చుచేసి మృతదేహాన్ని సొంతూరికి తరలించడం భరించలేక కొంతమంది మృతదేహాలను ఆస్పత్రులలో వదిలేసి పారిపోవడం లాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జిరిగిన సందర్భాలలో ఇలాంటివి జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన సందర్భంలో తప్పనిసరి పరిస్థితిలో నగరంలోని ప్రధాన ఆస్పత్రులైనన ఉస్మానియా, గాంధీ లాంటి ఆస్పత్రులకు తరలిస్తారు. కన్నుమూస్తే మాత్రం మృతదేహాలను తరలించడానికి నానా అవస్థలు పడుతున్నారు.

**ఉచిత అంబులెన్స్ సదుపాయం ఉన్నా....**

నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన ఉస్మానియా, గాంధీ లాంటి పెద్దాసుపత్రులలో పేద రోగులకు నిర్ణీత దూరం వరకు ఉచిత అంబులెన్స్ సదుపాయం ఉన్నా వాటిని వినియోగించుకోవడం మాత్రం అంత తేలిక కాదు. ప్రభుత్వ ఆస్పత్రులైనప్పటికి చాలమందికి ఉచిత అంబులెన్స్ సదుపాయం ఉన్న విషయం కూడా తెలువదు. పేదలు ,దిక్కులేని వారు ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందుతూ మృతిచెందితే ఆయా మృతదేహాలను వారివారి గ్రామాలకు తరలించడానికి ఆస్పత్రి ఉచితంగా ప్రభుత్వ అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేస్తుంది. ఏ వార్డులో అయితే చికిత్స పొందుతూ మృతి చెందారో ఆదే వార్డులో డాక్టర్‌లు, నర్సులు, ఇతర సిబ్బంది ద్వారా ఆర్ఎంఓను కలిస్తే ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ వాహనాన్ని హెర్షే వాహనం అంటారు. తెలంగాణ జిల్లా బార్డర్‌లోని ఏ గ్రామానికైనా ఉచితంగానే మృతదేహాలను తరలిస్తారు. తెలంగాణ సరిహద్దు పక్కనున్న గ్రామాలకు తరలించాలంటే హెర్షే వాహనాన్ని కేవలం సరిహద్దు వరకు వదిలేస్తారు. అక్కడి నుంచి వారే వేరే వాహనాన్ని ఏర్పాటు చేసుకొని వెళ్ళాల్సి ఉంటుంది. చికిత్స పొందిన వార్డులోనే సంప్రదిస్తే ఒక దరఖాస్తును అందజేస్తారు. దాన్ని పూరించి అప్పగిస్తే ఆర్ఎంఓనే హెర్షే వాహన ఏర్పాట్లు జరుపుతారు. అయితే చాలామంది ఎవరిని సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితిలో ప్రైవేట్ అంబులెన్స్‌లలో మృతదేహాలను తరలిస్తున్నారు. ఇందుకోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కనీస మానవత్వాన్ని మరిచి నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉస్మానియా, గాంధీ లాంటి ఆస్పత్రలలో మృతదేహాలను తరలించడానికి సదుపాయం ఉన్నా ప్రచారం మాత్రం లేదు. ఇది తెలియక ప్రైవేట్ ఆంబులెన్స్‌దారులకు బలవుతున్నారు. 20, 30, 40 కిలోమీటర్‌ల దూరానికి కూడా వేలకువేలు గుంజుతున్నారు. అంత ఖర్చు చేయకుంటే మృతదేహాలు మాత్రం మార్చ్యురిలో ఉంచాల్సిందే. ఇంత ఖర్చును భరించలేక కొందరు పేదలు మృతదేహాలను కొన్నిసార్లు ఆటోలలో కూడా తరలించిన సంఘటనలు ఉన్నాయి.





**ఎన్ని ఉన్నా కదిలేవి కొన్నే...**

ఇక్కడి ఆస్పత్రులలో చికిత్స పొందుతూ మృతి చెందిన పేదలు, దిక్కులేని వారు మరణిస్తే తరలించడానికి ఉస్మానియా ఆస్పత్రిలో దాదాపు 10 1ఆంబులెన్స్(హెర్షే) వాహనాలు, గాంధీ ఆస్పత్రిలో ఐదు వాహనాలు, నిమ్స్‌లో రెండు వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలలో కదిలేందుకు వీలుగా కేవలం ఏడెనిమిది వాహాలు మాత్రమే సిద్ధదంగా ఉన్నాయి. మిగిలిన వాహనాలు మెయింటనెన్స్ లేని కారణంగా మూలన పడ్డాయి. మరికొన్ని వాహనాలలో మాత్రం ఫ్రీజర్‌లు పనిచేయని స్థితిలో ఉన్నాయి. కదిలేందుకు సిద్దంగా ఉన్న వాహానాలు కదలాలంటే అందకు డ్రైవర్‌లు నిరాకరించడం పరిపాటిగా మారింది. కొందరు ప్రైవేట్ అంబులెన్స్ వాహదారుల నుంచి అందుతున్న నజరానాలకోసం ఇలాంటి అమానవీయ ఘటనలకు పాల్పదుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కమీషన్‌ల కోసం పేదలను జలగల్లా పీడిస్తున్న అంబులెన్స్ డ్రైవర్‌లు మనుషుల్లా ఆలోచించాల్సిన అవసరం ఉందని రోగులు అంటున్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి**



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ నేరంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి.

**బేగంపేట డిసెంబరు 23,ప్రభాతవార్త**

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బేగంపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఏసీపీ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరస్తులు మొబైల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌ల ద్వారా వ్యక్తి గత సమాచారాన్ని సేకరిస్తూ వారికి తెలియకుండా నేరాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి మోసాలపట్ల విద్యార్థినులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ రకాలైన యాప్‌ల ద్వారా నేరస్థులు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని, ఓటీపీలు, సీవీవీ నంబర్‌లు అడుగుతూ బ్యాంకుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్స్‌పెక్టర్ సైదులు మాట్లాడుతూ ఫేస్‌బుక్, స్నాప్‌ఛాట్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో సోషల్ మీడియా మోసం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరస్థులు బ్లాక్‌మెయిల్ చేయడానికి డబ్బు దోచుకోవడానికి నకిలీ చిత్రాలతో మోసాలకు పాల్పడుతుంటారని చెప్పారు. ఫోన్‌లను అధికంగా వినియోగించడం వల్ల ఇలాంటి మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. డిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గుర్తు తెలియని వారి నుంచి వచ్చే ఫ్రెండ్ షిప్ మెసేజ్‌లను అంగీకరించవద్దన్నారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలను ఎవరికీ షేర్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కు కాల్ చేయాలన్నారు. అదే సమయంలో సమీపంలోని పోలీసుస్టేషన్ లో కూడా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జి.రాములు, మధుకర్‌రావు, ఎస్.ప్రసన్న, డా.సరిత, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిటిడి దేవాలయాన్ని సందర్శించిన తిరుపతి ఇవో అనిల్‌కుమార్ సింఘాల్

**సైఫాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** లిబర్టీ వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం టిటిడి కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన దేవాలయంలో కొనసాగుతున్న సౌకర్యాలను సమీక్షించారు. భక్తులను అడిగి సౌకర్యాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఈ నెల 30వ తేదీన దేవాలయంలో జరిగే వైకుంఠ దశమి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. టిటిడి క్యా లెండర్లు, డైరీలు విక్రయ కౌంటరును సందర్శించారు. అంతకు ముందు ఆయన దేవాలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు అశ్వీరచనాలు అందజేశారు. ఆయన తీర్థప్రసాదాలను స్వీకరించారు.



భక్తులతో మాట్లాడుతున్న టిటిడి ఇవో అనిల్‌కుమార్ సింఘాల్

## ఐసిఎఆర్ ఆధ్వర్యంలో శీతాకాలం శిక్షణ

**అత్తాపూర్ డిసెంబర్ 23,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని పశువైద్య కళాశాలలో సంక్రమణ రోగాల గుర్తింపుకు ఆధునిక అణు జీవశాస్త్ర పరికరాలు, వన్ హెల్త్ ,ఫైలోజెనెటిక్ దృక్పథం అనే అంశంపై ఐసిఎఆర్ ప్రాయోజిత శీతాకాల శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్‌నత సైన్సెస్ ఉపకులపతి డా.ఎం విషువర్ధన్ రావు ప్రసంగించారు. ముఖ్యంగా కొవిడ్ అనంతరం కాలంలో వన్ హెల్త్ దృక్పథం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, జినోసిస్ వ్యాధుల, సంక్రమ ణ రోగాల త్వరిత గుర్తింపు నివారణకు ఆధునిక అణుజీవ శాస్త్ర పరికరాల అవసరాన్ని ,వాటి యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. శాస్త్రవేత్త గౌరిశంకర్ మాట్లాడుతూ. సూక్ష్మజీవులు, మానవులు, పర్యావరణ వ్యవస్థలు ,ప్రపంపం ఆరోగ్యం మధ్య ఉన్న అనుబంధాన్ని వివరించారు. వన్‌హెల్త్ వ్యవస్థను బలోపేతం చేయడంతో అణుజీవశాస్త్రం ,గణాత్మక విధానాల కీలకపాత్రను వివరించారు. డిన్ ,ప్రొఫెసర్ ఎం.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ....కొత్తగా ఉద్భవిస్తున్న ,తిరిగి ప్రబలు తున్న వ్యాధులను ఎదుర్కొవడంలో వన్‌హెల్త్ భావన ఎంత ముఖ్యమో వివరించారు. జూనోటిక్ వ్యాధులపై దృష్టి సారిస్తూ మానవ ఆరో గ్యం, జంతు ఆరోగ్యం ,పర్యావరణ వ్యవస్థల మధ్య సమగ్ర సమన్వయం అసవరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివా స్, అసోసియేట్ డిన్ మాధూరి, కోర్సు డైరెక్టర్ విజయ కుమార్‌లు మాట్లాడుతూ... శిక్షణ కార్యక్రమ లక్ష్యాలు, పరిధి ఆశించిన ఫలితాలను వివరించారు. వన్ హెల్త్ ,ఫైలోజెనెటిక్ దృక్పథం ఆధారంగా సంక్రమణ రోగాల సమర్థవంతమైన గుర్తింపు, నియంత్రణకు అవసరమైన ఆధునిక అణుజీవ శాస్త్ర పరికరాలపై పాల్గొనేవారి జ్ఞానం ,ప్రాయోగిక నైపుణాలను పెంపొందించడమే ఈ శీతకాల విక్షణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.రాహుల్ నారంగ్, నాగేంద్ర హెగ్డే, ఎస్.అసోసియేట్ ప్రొ.డా.వంశీ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పరుపుల గోదాంలో అగ్నిప్రమాదం

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని ఒక పరుపుల గోదాంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించి పలు వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్‌లోని లిమ్రా పర్నిచర్ అండ్ సోఫా వర్క్ షాపును ఇటీవల ఏర్పాటు చేశారు. ఇంకా కొన్ని పునులు సాగుతున్నాయి. పరుపుల గోదాంలో మంగళవారం ఉదయం వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు వెంటనే పోలీసులు, ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. వెల్డింగ్ జరుగుతుండగా పరుపులకు మంటలు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించిందని పోలీసులు పేర్కొంటున్నారు. భారీగా అస్తి నష్టం సంభవించిందని నిర్వహకులు పేర్కొంటున్నారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉప్పల్ భగాయత్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధం అయిన పరుపుల గోదాం దృశ్యం.

## విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి

**అత్తాపూర్ డిసెంబర్ 23,ప్రభాతవార్త :** విద్యుత్ ఘాతానికి గురైై ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం...హిమాయత్ సాగర్ వద్ద ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో వాజీద్ (32) అనే వ్యక్తి ఎలక్ట్రికల్ పనులు చేస్తుడు. ఈ క్రమంలో రాడ్‌ను మోసుకొని పైకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

# వేడుకలకు వేళాయరా...

**-క్రిస్మస్,న్యూఇయర్ వేడుకలకు హోటళ్లు ముస్తాబు**
**-ఇతర రాష్ట్రాల నుంచి సెలబ్రిటీల ఆహ్వానం**
**-యువతను ఆకట్టుకునేందుకు వ్యాపారుల ప్రయత్నాలు**







**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:** నగరంలో ముందుగానే క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల అడావిడి మొదలైంది. ముందుగానే క్రిస్టమస్ పండుగ ఉండటంతో అన్ని హోటల్స్‌లో కేక్ మిక్సింగ్ తయారీతో ఆకట్టుకుంటున్నారు. కొందరు సెలబ్రిటీలను ఆహ్వానిస్తుండగా, మరికొందరు సొంత చెఫ్‌లతో కేక్ మిక్సింగ్ తయారు చేస్తున్నారు. ప్రత్యేక సంగీతాలాపనతో నగరంలోని సికింద్రాబాద్ సెంటినరీ బాపిస్ట్ చర్చి, ఎస్పీజీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. వేడుకలు ఆధికారికంగా ప్రారంభం కావడంతో షాపింగ్‌సందడి కూడా మొదలైంది. నగరంలోని షాపింగ్ మాల్స్‌లో రకరకాల క్రిస్‌మస్ ట్రీలు, స్టార్ డెకరేషన్ ఐటమ్స్ విద్యుత్ వెలుగులతో ఇప్పటికే కొనుగోలు దారులను ఆకట్టుకుంటున్నాయి. సినీతారలు, రాజకీయ ప్రముఖులు కేక్‌మిక్సింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు స్టార్‌హోటల్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు కొత్త సంవత్సర వేడుకలను ప్రత్యేక నిర్వహించడానికి సన్నదమౌతున్నారు. డిసెంబర్ 31తో ఈసంవత్సరానికి ముగింపు పలికి నూతన ఏడాదికి స్వాగతం పలికేందుకు హోటల్స్ నిర్వాహకులు విస్త్రతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ముందస్తుగా న్యూఇయర్ జోష్...**

నగరంలో న్యూఇయర్ వేడుకలు ప్రతిసారి అంగరంగ వైభవంగా జరుగుతాయి. నగరంలోని యువత పాత సంవత్సరానికి గుడ్‌బై చెప్పడానికి సిద్ధమైతుంది. ఈ అవకాశాన్ని మార్కెట్ చేసుకోవడానికి వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాలు యువతను ఆకర్షించుకోవడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన స్టార్స్ తీసుకువచ్చి కార్యక్రమాలు నిర్వహించేందుకు సనా న్నహాలు చేస్తున్నారు. విశ్వనగరంగా ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న హైదరాబాద్‌కు రోజురోజుకూ క్రేజీ పెరుగుతుంది. దీంతో ప్రస్తుతం స్టార్ హోటల్స్, క్లబ్ హౌజ్‌లు న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడానికి సినిమా స్టార్లతో ముందస్తుగా అగ్రిమెంట్లు కుదుర్చుకున్నాయని తెలుస్తుంది.

**క్రిస్మస్ వేడుకల్లో డ్రైఫ్రూట్స్‌కు ప్రత్యేక స్థానం..**

కేక్‌లు మిఠాయిల స్థానాన్ని డ్రైఫ్రూట్స్ ఆక్రమిస్తున్నాయనేది మార్కెట్ నిపుణుల మాట. నూతన సంవత్సర వేడుకల్లో డ్రైఫ్రూట్‌కు ఉన్నతాదాయ వర్గాలు రెడు దశాబ్దాల క్రితమే స్థానం కల్పించారు. సాధారణ మధ్యతరగతి ప్రజలు సైతం ఇదే బాట పట్టడం తాజా మార్పు. ప్రత్యేకంగా చిన్న బాక్స్‌ల్లో అలంకరించిన అంజూరాలు, కాజు, బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూరాలతో ప్యాక్ చేస్తున్నారు. అనుబంధాలను పెంచడంతో పాటు ఆరోగ్య సందేశాన్ని మోసుకొస్తున్న డ్రైఫ్రూట్ గిఫ్ట్‌బాక్స్‌లకు పెద్దఎత్తున ఆదరణ లభిస్తుంది. పండుగ సీజన్‌ను దృష్టిలో హోల్‌సెల్ వ్యాపారులు టన్నుల కొద్ది సరుకు దిగుమతి చేసుకుంటున్నారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలనుండి లక్షల సంఖ్యలో డిజైన్ల బహుమతుల పెట్టెలు నగరానికి వస్తున్నాయి. ఆన్‌లైన్ ఆఫర్ల మోత మోగుతుండడంతో నగర వాసులు పెద్దఎత్తున ఆర్డర్లు ఇస్తున్నారు. కార్పొరేట్, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఒక్కో గిఫ్ట్‌ప్యాక్ 150 నుండి వెయ్యి వరకు పలుకుతుందని తెలిపారు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, గల్ఫ్, అమెరికా యూరప్‌ల నుండి దిగుమతి అయ్యే డ్రైఫ్రూట్స్‌కు నగరంలో డిమాండ్‌కు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

## వైభవంగా పోచమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**మూసాపేట్, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పోచమ్మ దేవాలయంలో గత రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా అమ్మవారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బొడ్డురాయి బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకార, కుంకుమ అర్చన, హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా మంగళవారం దుర్గా హోమం, సువాసిని పూజ, లలితా సహస్ర నామ పారాయణ, సామూహిక కుంకుమార్చనతో పాటు బొడ్డురాయి, బోనాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణగావించారు. ఈ బ్రహ్మోత్సవాలకు బిజెపి సీనియర్ నాయకులు కంచి మహేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫతేనగర్ డివిజన్ ప్రజలు భక్తులు అందరరు పూజలలో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కంచి స్వామి, కంచి పాండు మహేష్, కంచి దినేష్, కంచి ప్రశాంత్, మింటు, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

## ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి మహిళ మృతి

**గచ్చిబౌలి, డిసెంబరు 23 ప్రభాతవార్త**

అలిగిన కుమారుడిని వెతుకుతూ అర్థరాత్రి భవనంపైకి ఎక్కిన మహిళ ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రాజేష్‌లోరా, సునీతా దేవి దంపతులు బ్రతుకుదెరువు కోసం తమ కుమారుడితో నగరానికి వలస వచ్చారు. గౌలిదొడ్డి కేశవనగర్‌లోని ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. కాగా సోమవారం రాత్రి సునీతాదేవి తన కుమారుడు రోనక్ కుమార్‌ను కొట్టడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అర్థరాత్రి 12 గంటల ప్రాంతంలో కుమారుడిని వెతుకుతూ సునీతాదేవి భవనంపైకి ఎక్కింది. రెండవ అంతస్థులో ఉండగా కాలుజారి ప్రమాదవశాత్తు సునీతాదేవి కిందపడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సునీతాదేవి అక్కడికక్కడే మ ృతిచెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడుకోవాలి

**తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం**



తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

**ముషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** రాష్ట్ర జిడిపీలో 25శాతం వాటా ఉన్న రియల్ ఎస్టేట్ రంగాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి రియల్ ఎస్టేట్ వ్యాపారిపైనా ఉందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై, కోదండరాం మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత ముందుకు తీసుకుపోయే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వటానికి ఒక సెమినార్ నిర్వహించాలని, ఈ సెమినార్‌కు రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖులను, అసోసియేషన్ నాయకులను, బిల్డర్లను, ప్రభుత్వ పెద్దలను ఆహ్వానించి, ఒక చర్చ పెట్టాలని సూచించారు. అనంతరం నారగోని ప్రవీణ్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పగడాల రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నర్సయ్య, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజుగౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ సభ్యత్వాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, లక్షలాది మందిగా ఉన్న రియల్ ఎస్టేట్ అసోసియేట్స్‌ను ఐక్యం చేసి, ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లక్ష్మణరావు, శ్రీధర్, రాజుగౌడ్, బొమ్మ వెంకటేశ్వర్లు, రహిముద్దీన్, అన్నం వీర ప్రసాద్, మల్లేష్, శ్రీశైలం, జైపాల్‌రెడ్డి, వనజ, రాజిరెడ్డి, మహేష్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జైస్వాల్ కులస్థులు సామాజిక రంగాల్లో ముందు ఉండాలి




హిందీ పాఠ్యాన్ని తెలుగులో పూర్తిగా అనువదించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

**బేగంబజార్,డిసెంబర్ 23ప్రభాతవార్త:** సామాజిక రంగాలైన విద్య,ఉద్యోగ,రాజకీయ,ఆర్థిక రంగాలలో జైస్వాల్ కులస్థులు ముందు ఉండాలని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు.కలాలీ జైస్వాల్ సభ వార్షిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షిక సభలో అధ్యక్షులు దేవేంద్రకుమార్,శశిభూషణ్ కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రభూషన్ జీ.సునేరా,ఆదాయ వ్యవహారాల సురేంద్ర ప్రసాద్,రమేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.కుటుంబ స్మారక పారివారిక గ్రంథాన్ని విడుదల చేశారు.స్మారిక ప్రధాన సంపాదకులు డాక్టర్ సూర్య ప్రకాష్,స్వరూప్‌కుమార్,డాక్టర్ అనిల్‌మోడి, రాహుల్‌దేవ్, ,మైథిలీవేదరణ్,సారిక చౌదరి,అజయ్‌మోటారియా తదితరులు పాల్గొన్నారు.సమాజ అభివృద్ధి కోసంతమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు.జైస్వాల్,న్యాయవాదులు,ఇంజనీర్లను సన్మానించారు. నగరంలోనే కాకుండా తెలంగాణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున్న జైస్వాల్ తరలివచ్చారు.

## బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

**: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును కలిసిన ఏ.పి మహేష్‌బ్యాంకు కొత్తగా ఎన్నికైన వైస్ గోవింద్ నారాయణ రాఠి

**గన్‌ఫౌండ్రి, డిసెంబర్ 23ప్రభాతవార్త:** ఏ.పి మహేష్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అంది స్తూ,నమ్మకంతో ఖాతాదారులకు,డిపాజిట్లకు నమ్మకం కలిగించి బ్యాంకు అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు అన్నారు.వైస్ చైర్మన్‌గా ఎన్నికైన గోవింద్ నారాయణ రాఠి మర్యాద పూర్వకంగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుని కలిసి సన్మానించారు. చైర్మన్‌గా సి.ఎ.మురళి మనోహర్ పలోడ్,డైరెక్టర్లుగా దేవేంద్ర ఝున్వర్,కవితాతోష్ని వాల్, అమిత్‌లడ్డా,పవన్‌లోహియా,కైలాష్‌మంత్రి,రూపేష్‌సోని,వినోద్‌కువార్‌బంగ్,దీపక్‌బంగ్ ఉన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



4,5 వార్డులలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబర్ 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీనివాస్ తెలిపారు. బస్తీ పర్యటనలో భాగంగా మంగళవారం 5వ వార్డు సింహపురి కాలనీ, 4వ వార్డు కిషోర్ పుర,ఎరుకల బస్తీల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.303 కోట్ల వ్యయంతో డ్రైనేజీ నాలా అభివృద్ధి,శాశ్వత మరమ్మతుల పరిష్కారానికి ఖర్చు చేస్తున్నామన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దాల నర్సింహ్మ,సత్య నారాయణ, మల్లేశ్, నాగేందర్ యాదవ్, సంతోష్, ఆనంద్, కిరణ్, బిక్షపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ భాస్కరగిరికి సత్కారం



హైకోర్టు న్యాయవాది భాస్కర్ గిరిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు.

**బేగంపేట డిసెంబరు 23,ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ గా సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన హైకోర్టు న్యాయవాది ఏ.ఎస్.భాస్కరగిరి నియమితులవడంతో బీజేపీ నేతలు ఆయన్ను ఘనంగా సత్కరించారు.అభినందనలు తెలియజేసారు.ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ న్యాయ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.దీంతో న్యాయవాది ఏ.ఎస్.భాస్కర్ గిరి నియామకం పట్ల బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్,చీర సత్యనారాయణ (శ్రీకాంత్),నెమలి ఆనంద్(నందు),మేకల సారంగపాణి,మద్దెర్ల శ్యాంసుందర్,శ్రీశైలంగౌడ్,నాగేశ్వరరెడ్డి,టోపీ శంకర్,ఎస్ఆర్ మల్లేష్,సురేష్ రావల్,గోపి కృష్ణ,నరేంద్రపాల్ తదితరులు హర్షం వ్యక్తం చేసారు.

## వాసవీ మాత ఆశీస్సులు సమాజానికి ఎల్లప్పుడూ ఉండాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద

**జగద్గిరిగుట్ట, జీడిమెట్ల డిసెంబర్ 23, ప్రభాతవార్త** ధర్మం, న్యాయం, త్యాగానికి ప్రతీక అయిన వాసవీ మాత ఆశీస్సులు సమాజానికి ఎల్లప్పుడూ ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్టపై గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. అంతకముందు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ నేతి శంకర్ గుప్తా, ఫౌండర్ చైర్మన్ రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా, గౌరవ చైర్మన్ కాశం కైలాసం గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు గుప్తా, ట్రెజరర్ మహంకాళి సురేష్ గుప్తా, అడిషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి స్వామి గుప్తా, జాయింట్ సెక్రెటరీ అంగడి సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షులు లక్ష్మీనరసయ్య గుప్తా, షెర్వీరాల కృష్ణమూర్తి గుప్తా, పులిగిల్ల నర్సింహులు గుప్తా, గజ్జి ఉపేందర్ గుప్తా, డివిజన్ మైనార్టీ నాయకులు అజమ్, నాయకులు పాపులు గౌడ్, బాబు గౌడ్, మల్లేష్ గౌడ్, జైహింద్, బ్రహ్మానంద చారి, అంజయ్య, మహేందర్, నాని, విగ్నేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం 125 గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్, కైసర్ నగర్‌లోని ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై బోరు ప్రారంభించగా, సుమారు 5 లక్షల రూపాయల సొంత నిధులతో బోరును వేయించి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానందకి సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓ మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు నాయి, ప్రధాన కార్యదర్శి విఎస్ఆర్ వెంకటేష్ నాయి, మాజీ అధ్యక్షులు రేనయ్య నాయి, మాజీ ప్రధాన కార్యదర్శి పరమేష్ నాయి, మాజీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, సంఘ సభ్యులు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, సుంకరి చందు, నాగేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, సాయి బాబు, నవీన్, శ్రీరాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, ప్రసాద్, శివా నాయక్, జునైద్, గౌస్, లక్ష్మీ పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ ఒకేరకమైన అక్రెడిషన్ ఇవ్వాలి

### టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్

**హైదరాబాద్, డిసెంబరు 23,ప్రభాతవార్త:** జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి.యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చే విధంగా కొత్త జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో పనిచేసిన జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 2014 మార్చి నెలలో జరిగిన జర్నలిస్టు జాతరకు వచ్చిన అప్పటి కాబోయే ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చుకుందామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఆయన సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డ్స్ జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని, నేడు వాళ్ళ యూనియన్ కు చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ చైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు. మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టులనే వాళ్లకు అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అందరూ కలిసి రావాలి : హరీష్‌రావు



మాజీ మంత్రి హరీష్‌రావ్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన ఐటీ నిపుణుల దృశ్యం

**నార్సింగి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న సర్వభ్రష్ట కాంగ్రెస్ ప్రభుత్వంను గద్దె దింపేందుకు అన్ని వర్గాల నిపుణులు బిఆర్ఎస్‌తో కలిసి రావాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావ్ పేర్కొన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి నాయకత్వంలో మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం అధ్యక్షతన పలువురు ఐటీ నిపుణులు బిఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి హరీష్‌రావ్ గులాబీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్లవుతున్నా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420.హామీలను నెరవేర్చడం లేదన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు అమలుకు నోచుకోని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు మొండి చెయ్యి చూపిస్తుందన్నారు. యువత, మహిళ, ఉద్యోగ, కార్మిక, ఐటీ, అన్నదాతలు ఇలా అన్ని రంగాల ప్రజలందరూ ఎప్పుడెప్పుడు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వస్తాయా? కేసీఆర్‌ను సీఎంను చేద్దామా? అసమర్థ, పరిపాలన చేతగాని కాంగ్రెస్‌ను గద్దె దించుదామా అని ఎదిరి చూస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్‌కు రోజులు దగ్గర పడ్డాయని హరీష్‌రావ్ స్పష్టం చేశారు. నాయకులు పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎదురులేని శక్తిగా మార్చుకోవాలని సూచించారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌కు చెందిన ఐటీ నిపుణులు, రాగా అపార్టుమెంట్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకట్ చెక్కిలం, నాగరాజు తదితరులు బిఆర్ఎస్‌లో చేరారు.

## బిసి విద్యార్థులంటే ప్రభుత్వానికి చిన్న చూపా : బిసి పొలిటికల్ ఫ్రంట్




సమావేశంలో మాట్లాడుతున్న దుర్గయ్యగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్,డిసెంబరు 23,ప్రభాతవార్త:** బిసి విద్యార్థులంటే ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపు అని బిసి పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్. దుర్గయ్య గౌడ్, కన్వీనర్లు యెలికట్టే విజయకుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్‌లు విమర్శించారు. మంగళవారం చిక్కడపల్లిలోని పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పది వేల కోట్లు ఉన్నాయని అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాల కింద ఇచ్చింది ముష్టి 3వేల కోట్లు కూడా కాదని అన్నారు. ఎస్సీలకు 191.63 కోట్లు, ఎస్టీలకు 152.50 కోట్లు కాగా, బీసీ విద్యార్థులకు ఇచ్చింది. కేవలం 21.62 కోట్లు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 60 నుంచి 70 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఇస్తుందన్నారు. అయితే బీసీ విద్యార్థులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఫీజురీయింబర్స్మెంట్ మీద మాత్రమే చదువుతున్నారన్నారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించక నాలుగేళ్లు అవుతున్న నేటికి ఫీజు చెల్లించకపోవడం బాధకరమన్నారు. బీసీలోని పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడానికే ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. కోర్సు పూర్తిచేసుకున్న కూడా యాజమాన్యం ఫీజుల బకాయిలు చెల్లించడం లేదని సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో విఫలమయ్యిందన్నారు. భూముల వేలం నుంచి వేల కోట్లు వస్తున్నా పది వేల కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు చెల్లించి బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ బైరు శేఖర్, ఉపాధ్యక్షులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్‌లలో "ఫుడ్‌సేఫ్టీ " శిబిరం

### రిజిస్ట్రేషన్, లైసెన్స్,పరిశుభ్రతపై అవగాహన నగర వ్యాప్తంగా 14మార్కెట్‌లలో ఏర్పాటు



మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పుడ్‌సేఫ్టీశాఖ ప్రత్యేక శిబిరం

**హైదరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** కూరగాయల వ్యాపారుల్లో ఆహార భద్రత ప్రమాణాలు మరింత బలోపేతం చేయడం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. నగరంలోని 14 ప్రధాన కూరగాయల మార్కెట్లలో మంగళవారం రిజిస్ట్రేషన్ నమోదు, లైసెన్సింగ్ శిబిరాలు నిర్వహించారు.ఈ శిబిరాల ద్వారా కూరగాయల వ్యాపారులకు రిజిస్ట్రేషన్, లైసెన్సులు జారీ చేయడంతో పాటు, ఆహార పరిశుభ్రత, భద్రతా నిబంధనలు, మార్కెట్ ప్రాంగణాల్లో శానిటేషన్ నిర్వహణపై వ్యాపారులకు అవగాహన కల్పించారు.ఈ శిబిరాలు కుషాయిగూడ, ఉప్పల్ కూరగాయలు-పండ్ల మార్కెట్, సరూర్ నగర్ రైతు బజార్, ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్, వనస్థలిపురం రైతు బజార్, మాదన్నపేట కూరగాయల మార్కెట్, మీర్ ఆలం మండి, ఓవైసీ కూరగాయల మార్కెట్, మోండా మార్కెట్, మెట్టుగూడ కూరగాయల మార్కెట్, ఎర్రగడ్డ కూరగాయల మార్కెట్, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్, లింగంపల్లి మార్కెట్, జేఎన్‌టీయూ రైతు బజార్‌లలో నిర్వహించారు.ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం ఈ శిబిరాలల్లో మొత్తం 926 మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకున్నారు.ఈమార్కెట్లలో డిసెంబర్ 30న మరో విడత శిబిరాలు నిర్వహించనున్నట్లు ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు ప్రకటించారు.

## గర్భస్థ శిశు ఆరోగ్య పరిరక్షణలో కీలక ముందడుగు

**- నిమ్స్‌లో ఫీటల్ మెడిసిన్ సదుపాయం ప్రారంభం**



ఫీటల్ మెడిసిన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప, చిత్రంలో ఇతర వైద్యులు ఉన్నారు.

**జుబ్లీహిల్స్, డిసెంబరు 23, ప్రభాతవార్తః** పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో మెడికల్ జెనెటిక్స్ విభాగంలో అత్యాధునిక ఫీటల్ మెడిసిన్ సదుపాయాన్ని ప్రారంభించారు. మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి, ఫీటల్ మెడిసిన్ ఫెసిలిటీ ఇన్‌చార్జ్ డా. షగున్ అగర్వాల్, నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగరి బీరప్పతో కలిసి ఈ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీటల్ మెడిసిన్‌లో వినియోగిస్తున్న హైఎండ్ అల్ట్రాసౌండ్ యంత్రం పనితీరును ఇక్కడ వివరించారు. ఈ విభాగం భారత ప్రభుత్వ జాతీయ అరుదైన వ్యాధుల విధానం కింద గుర్తింపు పొందింది. ఈ సదుపాయంలో 2డీ, 3డీ గర్భస్థ శిశు అల్ట్రాసౌండ్ పరీక్షలతోపాటు అమ్నియోసెంటీసిస్, కోరియానిక్ విల్లస్ శాంప్లింగ్ వంటి ఇన్వేసివ్ ప్రీనేటల్ డయాగ్నోస్టిక్ పరీక్షలను అందిస్తున్నారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగరి బీరప్ప మాట్లాడుతూ, ఈ సౌకర్యం గర్భిణీ స్త్రీలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య పరిరక్షణలో ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతతో గర్భస్థ దశలోనే జన్యుపరమైన సమస్యలను గుర్తించి, సరైన వైద్యం అందించే అవకాశం ఈ సదుపాయం ద్వారా లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడమే నిమ్స్ లక్ష్యమన్నారు. మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి డా. షగున్ అగర్వాల్ మాట్లాడుతూ, 2013 నుంచే ఈ విభాగంలో ప్రీనేటల్ డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్నామని, తాజా సదుపాయాలతో అవి మరింత బలోపేతం అయ్యాయన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 780 హైరిస్క్ గర్భధారణ అల్ట్రాసౌండ్ పరీక్షలు, 500 ఇన్వేసివ్ ప్రీనేటల్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే కుటుంబాలకు కూడా ఈ సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ ఫీటల్ మెడిసిన్ ఫెసిలిటీకి వినియోగిస్తున్న అత్యాధునిక అల్ట్రాసౌండ్ యంత్రం ఖరీదు సుమారు రూ.1 కోటి కాగా, దీని ద్వారా పరీక్షలు అత్యంత తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.5,000 నుంచి రూ.8,000 వరకు ఖర్చయ్యే పరీక్షలు నిమ్స్‌లో రూ.1,000 నుంచి రూ.3,000 లోపే నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో రైతు దినోత్సవం




బ్రహ్మకుమారి కార్యాలయంలో రైతులకు ధన్యవాదాలు తెలియజేస్తున్న పిల్లలు

**సైఫాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రపంచ ధ్యాన దినోత్సవం, జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారి హిమాయత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పిల్లలకు ప్రత్యేక కార్యక్రమాన్ని బ్రహ్మకుమారి సంస్థ నిర్వహించింది. భారతదేశంకు ఋషి కృషి ప్రధాన భూమికని, మన పూర్వీకులు ధ్యాన ధనులని మనదేహ ఆర్థిక వ్యవస్థ కృషి, అలాగే వ్యవసాయ ఆధారిత వ్యవస్థ అని పిల్లలకు బి.కె మీనాక్షి ఈ సందర్భంగా తెలియజేశారు. మెడిటేషన్ ద్వారా నిత్యజీవితంలో ఏకాగ్రత ఏలా పెరుగుతుందని అనే అంశాన్ని ఆటల ద్వారా ఆమె పిల్లలకు తెలిపారు. ధ్యానం వల్ల కలిగే లాభాలను తెలుసుకున్న వారు మెడిటేషన్ అభ్యాసంలో పాల్గొన్నారు. రైతు దినోత్సవ ప్రాధాన్యత గురించి ఆమె మాట్లాడుతూ పళ్లెంలోకి భోజనం ఏలా వస్తుంది, దీని వెనుక రైతుపడే శ్రమను పిల్లలకు వివరించారు. రైతు ఎండనక, వాననక, చలి ఆనక, ప్రతి నిత్యం శ్రమిస్తాడని, ప్రకృతి వైపరిత్యాలకు చాలా సార్లు నష్టపోయినప్పటికి రైతు వ్యవసాయం మానకుండా మనకు ఆహారాన్ని అందిస్తారని ఆమె తెలిపారు. ఆ ఆహారాన్ని వృదా చేయరాదన్నారు. ఈ సందర్భంగా పిల్లలందరూ రైతులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.కె దిశ, బి.కె పద్మజా, హనీషా, మేధాన్ష పాల్గొన్నారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే వరకు ఉద్యమించాలి: గుర్రం,పవన్, జాజుల




సికింద్రాబాద్‌లో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సదస్సులో ప్రసంగిస్తున్న గుర్రం పవన్,చిత్రంలో జాజుల శ్రీనివాస్

**కంటోన్మెంట్,డిసెంబర్ 23 ప్రభాతవార్త:** ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు మార్చి 10వ తేదీన చేపట్టనున్న ఛలో బస్ భవన్‌కు ఆర్టీసీ కార్మికులు ప్రజా సంఘాలు, తరలి రావాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రీజినల్ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వ సభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. బీసీ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. బీసీలోని 136 ఉప కులాల కుల వృత్తులను వారు ప్రశంసించారు. బీసీలు అంటే బలహీనవర్గాలు కాదని, బ్రిలియంట్ క్లాస్‌కు చెందిన వారన్నారు. తెలంగాణ కోసం చేపట్టిన సకల జనుల సమ్మెలో ఆర్టీసి ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్టీసి బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు బాల్‌రాజ్ యాదవ్, తిరుపతయ్య, మల్లేశం పాల్గొన్నారు.

## సర్వే నెం 74లో ఉన్న స్థలమంతా మాదే : ప్రభాకర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బొట్టు ప్రభాకర్

**అడ్డగుట్ట,డిసెంబర్ 23 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండలం మహేంద్రహిల్స్ సర్వే నెం 74లో ఉన్న 306 ఎకరాల స్థలం తమదేనని కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పువచ్చిందని కంటోన్మెంట్‌కు చెందిన బొట్టు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీ ఎస్.7బై 1988 ప్రకారం సర్వేనెం 74పైగాలో ఉన్న స్థలం తమేదేనన్నారు. కొందరు సొసైటీల పేర్లతో తమ స్థలాన్నీ అక్రమించుకున్నారన్నారు. ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్టకు చెందిన నాయకులు ఆనంద్,రాజు, సంతోష్, ఇటుక గోపీలు పాల్గొన్నారు.

## జడ్పీ స్కూలు స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడండి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కూకట్‌పల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి మండల రెవెన్యూ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్లో సర్వే నెంబర్ 336లో ఎల్లమ్మ బండ జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన నాలుగు ఎకరాల 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుండి కాపాడాలని కోరుతూ బిజెపి నాయకులు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుండి కాపాడాలని గత నెల 22న స్థానిక మండల రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇచ్చి నెల రోజులు గడిచిన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ పాఠశాల స్థలం అక్రమనకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు రామరాజు, రామిరెడ్డి, దానబోయిన నర్సింగ్ రావు పాల్గొన్నారు.

## కేస్ స్టడీ ఛాలెంజ్ జాతీయ పోటీలో విద్యార్థులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** శివశివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు డిసెంబర్ 17న న్యూఢిల్లీలో జరిగిన 15వ గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో భాగంగా జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నేషనల్ కేస్ స్టడీ ఛాలెంజ్ జాతీయ పోటీలో టాప్ 5 స్థానాన్ని కైవసం చేసుకోవడం జరిగింది. 2035 నాటికి గ్లోబల్ ఎక్సలెన్స్ కోసం భారతదేశ ఉన్నత విద్య పర్యావరణ వ్యవస్థను నిర్మించడం అనే థీమ్‌పై ఉన్నత విద్య విద్యార్థుల కోసం సిఐఐ నేషనల్ కేస్ స్టడీ ఛాలెంజ్ గ్రాండ్ ఫినాలేను ఈ సమ్మిట్ నిర్వహించింది. మొదటి రౌండ్‌లో 61 జట్లు షార్ట్‌లిస్ట్ చేయబడ్డాయి. రెండవ రౌండ్ మూల్యాంకనం తర్వాత, కేవలం 11 జట్లు మాత్రమే ముందుకు సాగాయి. పరిశ్రమ నిపుణులు నిర్వహించిన కఠినమైన తుది అంచనా తర్వాత, దేశవ్యాప్తంగా కేవలం 5 జట్లను మాత్రమే ఎంపిక చేశారు. ఎం. సతీష్ కుమార్ – పీజీడీఎమ్ (బిజినెస్ ఎనాలిటిక్స్), అశోక్ కుమార్ పాశ్వాన్ – పీజీడీఎమ్, దిశా దెవొల్వార్ – పీజీడీఎమ్ శివ శివాని విద్యార్థులు భారతదేశం యూఎస్డి 70బిలియన్ అవకాశంపై కేస్ స్టడీని ప్రదర్శించి టాప్ 5లో స్థానాన్ని సాధించారు. ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని ది లలిత్ హోటల్‌లో జరిగింది. నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కోచైర్‌పర్సన్ డాక్టర్ నందిని రంగస్వామి, ఇతర ప్రముఖులతో కలిసి వారి పనిని గుర్తించి బృందాన్ని మెమెంటో, బహుమతితో సత్కరించారు.

## సికింద్రాబాద్‌లో విహెచ్‌పి, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**సికింద్రాబాద్, డిసెంబర్ 23 ప్రభాతవార్తః** విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం చిలకలగూడ చౌరస్తా నుండి సంగీత్ చౌరస్తా వరకు నిరసన పాదయాత్ర, ధర్నాను నిర్వహించింది. బంగ్లాదేశ్‌లోని జిహాదీ శక్తుల నుండి హిందువులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. హిందువులకు తగిన రక్షణ కల్పించాలని, నేరస్థులందరినీ న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షించాలని, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు.బంగ్లాదేశ్ హిందువుల పరిస్థితి దయనీయంగా మారిందని, హిందువులను ప్రతిరోజూ లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు., వారి ఇళ్లు, దుకాణాలను దోచుకుంటున్నారని, మహిళల జీవితాలు, గౌరవ మర్యాదలకు నిరంతరం తీవ్రమైన ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. డిసెంబర్ 18న, మైమెన్‌సింగ్‌లోని బలుకాలో దీపు చంద్ర దాస్ అనే 25 ఏళ్ల వస్త్ర కర్మాగార కార్మికుడిని ఒక మూక కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించి సంఘటన భారతీయులందరిని ఎంతో ఆవేదనకు గురి చేసిందని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పరస్పర దాడులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త** హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో దారుణం చోటు చేసుకుంది. ఏడో తరగతి విద్యార్థిపై అదే స్కూల్లో చదువుతున్న విద్యార్థులతో దాడి చేయించిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శివరామ కృష్ణ కుమారుడు సూర్య 7వ తరగతి చదువుతున్నాడు. అతన్ని విద్యార్థులు పార్కు చేసిన సైకిళ్ల వద్దకు వెళ్లి చూసి రమ్మని ఉపాధ్యాయుడు మధు చెప్పడంతో చూసొచ్చాడు. అయితే సూర్య సైకిళ్ల వద్దకు వెళ్లి వస్తున్నాడని మరో ఉపాధ్యాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, దుండిగల్ మండల ఎంఈవో కృష్ణ వద్దకు తీసుకెళ్లాడు. ఆయన ఆగ్రహించి 10వ తరగతి విద్యార్థులను పిలిచి బాలుడి వీపుపై కొట్టాలని ఆదేశించారు. దీంతో వారు రెచ్చిపోయి క్రూరత్తో విపరీతంగా దాడి చేశారు. ఈ విషయం బయట చెబితే పాఠశాల నుంచి టీసీ ఇచ్చి పంపిస్తానని హెచ్ఎం బెదిరించాడు. దెబ్బలు తట్టుకోలేక సూర్య రాత్రి నీరసంగా ఉండటంతో తల్లిదండ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణను సంప్రదించగా తానే విద్యార్థులను పిలిపించి కొట్టుమని చెప్పానని, కానీ అంత పెద్దగా కొడతారని అనుకోలేదని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వంశీధర్ తదితరులు

హైదరాబాద్,డిసెంబరు 23,ప్రభాతవార్త: గండిపేట్‌లో ప్రజల రాకపోకలకు ఉపయోగపడుతున్న అంతర్గత రహదారిని అక్రమంగా ఆక్రమించుకున్న కార్పొరేటర్‌పై చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని న్యాయవాది డా. బి. వంశీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నర్సింహా రెడ్డి, బి. ప్రసన్న కమలతో కలిసి ఆయన మాట్లాడుతూ...గండిపేట్ గ్రామ పరిధిలో దశాబ్దాలుగా ప్రజలు వినియోగిస్తున్న అంతర్గత రహదారిపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి గండిపేట్ మెయిన్ రోడ్ నుంచి అనేక ప్లాట్లు, ఇళ్లకు ప్రధాన మార్గంగాఉందన్నారు. పశ్చిమ వైపున ఆలయానికి,తూర్పు వైపున విద్యుత్ స్తంభాలు,మున్సిపల్ డ్రైనేజ్ లైన్లు ఉండటంతో ఇది పబ్లిక్ యాక్సెస్ రోడ్ అన్నది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఇండియన్ ఈజ్‌మెంట్ చట్టం-1882 ప్రకారం 20 ఏళ్లకు పైగా నిరంతర వినియోగంలో ఉన్న మార్గంపై ప్రజలకు చట్టబద్ధమైన హక్కు ఉంటుందని గుర్తుచేశారు. కార్పొరేటర్ తన భర్త సహకారంతో రహదారిని అక్రమంగా ఆక్రమించిన వ్యవహారంపై విచారణ జరిపించి, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో పాటు రహదారిని అధికారికంగా ప్రజా మార్గంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇది భూ వివాదం కాదని,ప్రజల మౌలిక హక్కులకుసంబంధించిన అంశమని అధికారులు వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పుస్తకం పరీక్షల్లో విజయానికి 18 సూత్రాలు

**లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ**


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ

**ముషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడే పుస్తకం పరీక్షల్లో విజయానికి 18 సూత్రాలు అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ కొనియాడారు. మంగళవారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్ లోని కొంపల్లి వెంకట్‌గౌడ్ ప్రాంగణంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండ్లూరు సురేంద్రబాబు రచించిన పరీక్షల్లో విజయానికి 18 సూత్రాలు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలో మిషన్ల వాడకం పెరిగి, పుస్తకపఠనం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజానికి సేవా దృక్పథం కలిగిన వైద్యులు ఉండటం ఎంతో సంతోషదాయకమని అన్నారు. పుస్తక రచయిత డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ తాను కటిక పేదరికం నుంచి నేడు ఉన్నత స్థాయికి చేరుకోవటానికి కారణం పుస్తక పఠనమేనని తెలిపారు. తాను రచించిన ఈ పుస్తకంలో ప్రతిభావంతులైన విద్యార్థులకే కాకుండా ఆత్మవిశ్వాస లోపంతో సతమతమవుతున్న ప్రతి విద్యార్థికి ఒక టార్చ్‌లాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ అండ్ అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, ప్రముఖ సినీ రచయిత డాక్టర్ అశోక్‌కుమార్, ప్రముఖ పేరెంటింగ్ కోచ్ విజయలక్ష్మి,జయవారాహి గ్రూప్ ఆఫ్ హస్పటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను ప్రజలకు చేరువ చేయడంలో న్యాయవాదులు కీలకం


బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ రూపొందించిన 2026 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమీషనర్ డాక్టర్ ఈ.గంగాధర్

**చిక్కడపల్లి డిసెంబర్ 23 (ప్రభాతవార్త ) :**కార్మిక చట్టాలను ప్రజలకు చేరువ చేయడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమీషనర్ డాక్టర్ ఈ.గంగాధర్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయం ఆవరణలోని అదనపు కమీషనర్ ఛాంబర్ లో బార్ అసోసియేషన్ అఫ్ లేబర్ కోర్ట్ రూపొందించిన 2026 నూతన సంవత్సర డైరీని డాక్టర్ ఈ.గంగాధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘురాం రెడ్డి, ఎం.మధుసూదన్, సభ్యులు వచ్చా తిరుపతి రెడ్డి , వై రంజిత్ రెడ్డి , కమిటీ సభ్యులు ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి క్రమశిక్షణకు మారుపేరు ఎసిపి విష్ణుమూర్తి

**-మంత్రి వివేక్ వెంకటస్వామి**


ఏసిపి విష్ణుమూర్తికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న మంత్రి జి.వివేక్, గగన్‌మల్లిక్ తదితర ప్రముఖులు

**నాంపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఇటీవల మృతిచెందిన ఏసిపి విష్ణుమూర్తి వృత్తి ధర్మానికి, క్రమశిక్షణకు మారుపేరని తెలంగాణ రాష్ట్ర కార్మిక గనులశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. లతారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా. బి.ఆర్.అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌లో సంస్థ వ్యవస్థాపకులు కె.కె.రాజా నేతృత్వంలో జరిగిన విష్ణుమూర్తి సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై జి.వివేక్ ముందుగా విష్ణుమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖలో విష్ణుమూర్తి ఒక ఉన్నతాధికారిగా అనేక అత్యుత్తమ సేవలు అందించారని ప్రశంసించారు. పోలీసుశాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు గగన్ మల్లిక్, అధికారులు, ప్రముఖులు, పాల్గొన్నారు.

## పిల్లలకు ఆట వస్తువుల పంపిణీ

**హైదరాబాద్ డిసెంబర్ 23 ( ప్రభాతవార్త ) :** బర్కత్ పుర అవంతి డిగ్రీ, పిజి కళాశాల జాతీ య సేవ పథకం( ఎన్ ఎస్ ఎస్ ) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే సేవా కార్యక్రమంలో భాగంగా పిల్లకు ఆట వస్తువులు, ఇతర విద్యకు సంబందించిన వస్తువులను పంపిణి చేసారు. స్థానిక గుంతపల్లి లో జరిగిన క్యాంపులో భాగం గా అక్కడే ఉన్న గ్రామంలో పాఠశాల పిల్లలకు వీటిని పంపిణి చేసారు.

## అద్భుతంగా సాగిన ప్రతి నోటా అన్నమయ్య పాట”


ప్రతి నోటా అన్నమయ్య పాట” గాత్ర సంగీత కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 23 (ప్రభాతవార్త ) :** ప్రముఖ సంగీత సంస్థ శ్రీ సాయి శ్రుతి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పద్మావతి కల్యాణ మండపం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రతి నోటా అన్నమయ్య పాట” అందరిని ఆధ్యాత్మిక సాగరంలో తేలియాడించింది. అకాడమీ డైరెక్టర్ శ్రీమతి గౌరీభట్ల వసుధామూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రధానాచార్యులు, ప్రముఖ సంగీత విద్వాంసులు గౌరీభట్ల లక్ష్మణమూర్తి స్వరసారథ్యంలో 100 మంది విద్యార్థులతో 100 అరుదైన అన్నమయ్య కీర్తనల ద్వారా వేంకటేశ్వర స్వామికి స్వరార్చన చేయాలనే సంకల్పంతో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. టిటిడి ద్వారా సుమారు 70 మంది కళాకారులు స్వరపరిచిన అన్నమయ్య కీర్తనలను సేకరించి, వాటిని అందరూ సులభంగా పాడుకొనే విధంగా రూపకల్పన చేసి, విద్యార్థులచే ప్రచార కార్యక్రమాలు చేపట్టిన ఈ కార్యక్రమ అందరి నుండి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా హరియవతారమే అతడితడు” అనే మకుటంతో కార్యక్రమంతో సామూహిక సంకీర్తనార్చన సభికులను అలరించింది. వర్ధమాన గాయని, ఈవెంట్ మేనేజర్ నందిని, కీబోర్డ్ కళాకారిణి, మ్యూజిక్ థెరపిస్ట్ యామిని సంగీత సహకారాన్ని అందించగా అతిథిధులుగా శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కె. భాస్కర్ రెడ్డి, శ్రీవేంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫరె అసోసీషన్ అధ్యక్షుడు జి. ధనం రెడ్డి , మ్యూజిక్ టీచర్, స్వరమహతి కళాపరిషత్ వ్యవస్థాపకులు డా. బందనపూడి ఆదిత్యకిరణ్, ప్రముఖ రచయిత్రి, సాహితీవేత్త అరుణ ధూళిపాళ, ప్రముఖ సంగీత గురువు ప్రఖ్యా జయశ్రీ పాల్గొంటారు.

## అభాగినులకు ఆశ్వినీ ఆపన్నహస్తం స్ఫూర్తిదాయకం : ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష


ఆర్థికసహాయమందుకున్న ఒంటరి అభాగ్యినులతో శిరీష, రమణాచారి, సుబ్బారావు తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఒంటరి మహిళలు కనీసం 600మందినైనా కొంత ఆర్థికంగా ఆదుకోవాలని సంకల్పించి ముందుకొచ్చిన వితరణశీలి ప్రముఖ పారిశ్రామికవేత్త అశ్వినీ సుబ్బారావు హృదయ వైశాల్యం ఎనలేనిది ప్రతీఒక్కరికీ స్ఫూర్తిదాయకమని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇంటలిజెన్స్ శిరీష అన్నారు. రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ శిరీష్ గౌరవ అతిథులు పాపారావు, భరత్, చెన్నారావు తదితరులతో కలిసి 20మందికిపైగా ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసి వారిని సహృదయంతో ఓదార్చారు. ఒంటరి మహిళలు వారి సాదకబాధకాలు, దుస్థితి తనకు బాగాతెలుసని, అయితే వారు ధైర్యంతో ముందుకుసాగితే ఎదురే ఉండదని, తనవంతు సహకారం అందిస్తానని భరోసానిచ్చారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో దానధర్మాలకు మారుపేరుగా అశ్వినీ సుబ్బారావు సమాజంలో అంగవైకల్యం, భర్తను కోల్పోయి పిల్లలతో ఒంటరి జీవితాలను ఆర్థిక సమస్యలతో ఎదుర్కొంటు మహిళలు, కులమతాలకు అతీతంగా నిరుపేదలకు, అభాగ్యులకు ప్రతీయేటా లక్షల్లో ఆర్థిక సహాయం అందజేసి మానవత్వానికి నిదర్శనంగా నిలవడం ప్రతీఒక్కరికీ స్ఫూర్తిదాయకం, వారిసేవలు అనంతసామాన్యమని అన్నారు. చివరిగా ఆర్థిక సహాయం పొందిన అభాగ్యినులు తమ స్పందనను తెలుపుతూ సమాజంలో సుబ్బారావు, రమణాచారి వంటి మహానుభావులుండడం ఆ భగవంతుడు ఇచ్చిన వరమని నమస్కరించారు.

## తెన్నేటి సుధా రామ రాజు పేరిట లక్ష రూపాయల సాహితీ పురస్కారం


నివాళులు అర్పిస్తున్న డాక్టర్ కెవి.రమణాచారి, కళా వి ఎస్.జనార్దన మూర్తి, వంశీ రామరాజు తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 23 ప్రభాతవార్త :** తెలుగు సాహిత్య ప్రక్రియలు కవిత కథ నవల నాటకం లలో ప్రతి ఏటా అంతర్జాతీయ స్థాయి లో రచయిత్రులు ను ఎంపిక చేసి వంశీ ఇంటర్నేషనల్ నిర్వాహణలో ఒకొక్కరికి పాతిక వేల నగదు జ్ఞాపిక తో సత్కరిస్తామని ప్రభుత్వ పూర్వ సలహాదారు, ఎంపిక కమిటి చైర్మన్ డాక్టర్ కె వి రమణాచారి ప్రకటించారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై జరిగిన త్యాగరాయ గానసభ నిర్వాహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన వంశీ ఆర్ట్స్ థియేటర్స్ సౌజన్యంతో ప్రముఖ రచయిత్రి సుధా దేవి సంస్మరణ కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ సుధా దేవి ఉత్తమ ధర్మ పత్ని గా మాతృ మూర్తి గా తన ధర్మాన్ని ఆచరించి నిష్క్రమించారు అని నివాళి అర్పించారు సుధా దేవి జన్మ దిన రోజు అక్టోబర్ 5 ప్రతి ఏటా ప్రదానం చేస్తారు అని చెప్పారు రామ రాజు తన భార్య సుధ రచయిత్రి కావున అవార్డు ల నిర్ణయం తీసుకోవడం సముచితం గా ఉంది అని అభినందించారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుధా దేవి గొప్ప రచయిత్రి ఉన్నత వ్యక్తిత్వం అని కొని యాడారు వంశీ రామరాజు అవార్డ్ ఎంపిక కమిటి ఉపాధ్యక్షుడు గా బూరుగు పల్లి వ్యాస కృష్ణ (ఉగాండా) సభ్యులు గా డాక్టర్ వంగూరి చిట్టెన్ రాజు (అమెరికా) రత్న కుమార్ కవుటూరు (, సింగపూర్) వంశీ రామరాజు కన్వీనర్ గా రాధిక (ముంబాయి), సమన్వయం చేస్తారు అని ప్రకటించారు సుధా రామ రాజు కుమారుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ సుధా దేవి మనమరాలు అనఘ నానమ్మ పై రాసిన కవిత చదివారు వేదిక పై బూరుగుపల్లి వ్యాస కృష్ణ, వంశీ ధర్ తరంగిణి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా గాన సభ లోని ఉద్యోగులకు నగదు పారితోషికం సుధా దేవి పేరిట అందించారు.

## ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి


ప్రజల ఆరోగ్యంను క్షీణింప చేసిన మామ్ పివిసి ప్రింటింగ్ ఫార్మ్‌పై చర్యలు తీసుకోవాలిన బండ్లగూడ డిసికి వినతిపత్రం ఇస్తున్న కిష్టారెడ్డి కాలనీ వాసులు.

**నార్సింగి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ సర్కిల్ పరిధిలోని కిష్టారెడ్డి కాలనీలో మామ్ పివిసి ప్రింటింగ్ ఫార్మ్ నుండి విషపూరిత వాయువులు వెలువడడం వలన స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని, ఈ కంపనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిసి శరత్‌చంద్రకు కాలనీ వాసులు వినతిపత్రంను అందజేశారు. కంపనీ నుంచి వినైల్ క్లోరైడ్, డయాక్సిన్స్ వంటి రసాయనాలు విడుదలవుతుండడం వలన, ముక్కుపుటలు అదిరిపోయే దుర్వాసన వస్తుండడం వలన శ్వాసకోశ సమస్యలు, అలెర్జీలు వచ్చి పిల్లలు, వృద్దులు నరకయాతన పడుతున్నారని వినతిపత్రంలో కోరారు. ఈ విషయంను భూ యజమానులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ప్రజల ఆరోగ్యంను దృష్టిలో ఉంచుకొని ఈ కంపనీపై చర్యలు తీసుకోవాలని, కిష్టారెడ్డి కాలనీ వాసులను కాపాడాలని డిసిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షులు వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు, విజయచారి, కిష్టారెడ్డి కాలనీ అధ్యక్షులు మురళీధర్, ప్రతినిధులు రామన్న, లక్ష్మన్న, శ్రీనివాస్, హేమశేఖర్ పాల్గొన్నారు.

## నీటి ఇబ్బందులు పరిష్కరించాలి

**జలమండలి ఎండికి వినతి**


మణికొండలో నీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆల్‌కాలనీస్ ఫెడ్రేషన్ ప్రతినిధులు.

**నార్సింగి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** మణికొండ సర్కిల్ పరిధిలో మంచినీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్‌కాలనీస్ ఫెడ్రేషన్ ప్రతినిధులు జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ క్యాన్ నెంబర్ సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. ఇంకా క్యాన్ నెంబర్ లేని వారికి వెంటనే ఇవ్వాలని, అవసరమైన నీటిని సరఫరా చేయాలన్నారు. 20నుంచి 30.శాతం అదికంగా నీటి బిల్లులు చెల్లించాలనడం అసంబద్దంగా ఉందని, దీనిపై పునరాలోచించాలని ఎండిని కోరామన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్నా లేకున్నా క్యాన్ నెంబర్‌ను కేటాయించే వెసలుబాటును కలిగించాలని తెలిపామన్నారు. మణికొండ, పుప్పాలగూడలోని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయు కేంద్రము నుంచి వృధా అయిన నీటిని కాలనీ రోడ్లపై ప్రవహించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. మేము ఎండికి తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీనిచ్చారని ఆంజనేయులు తెలిపారు. వినతిపత్ర ఇచ్చిన వారిలో ఆల్ కాలనీస్ కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఎంప్లాయిస్ కాలనీ అధ్యక్షులు గోవర్దన్‌రెడ్డి, కేపీఆర్ కాలనీ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 30న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు


కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి వైకుంఠ ఏకాదశి మహోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ శ్రీ బాలాజీ మందిరం పూజారి శృంగారం ఆత్రేయ చార్యులు

**చార్మినార్,డిసెంబరు 23 ప్రభాతవార్త :** చార్మినార్ సమీపంలో ఉన్న ఎంతో పురాతనమైన చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో డిసెంబరు నెల 30వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వహించనున్నామని దేవాలయం ప్రధాన అర్చకులు శృంగారం రమణా చార్యులు,శృంగారం ఆత్రేయ చార్యులు తెలిపారు.వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు సందర్భంగా దేవాలయాన్ని పలు రకాల రంగులతో అందంగా తీర్చిదిద్దారు.శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆత్రేయ చార్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు.30వ తేదీ మంగళవారం వేకువ జామున 3 గంటలకు సుప్రభాతంతో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ప్రారంభమవుతాయని,6 గంటలకు నేత్ర దర్శనం,6.30 గంటలకు స్వామి వారి వైకుంఠం ద్వార దర్శనం, పల్లకి ఊరేగింపుతదితర కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలియజే శారు. స్వామి వారి పల్లకి ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై చార్మినార్, గుల్జార హౌస్,కాలీకమాన్‌తో పాటు పలు ప్రాంతాలలో కొనసాగిన అనంతరం మందిరా నికి చేరుకుంటుంది.కొత్త సంవత్సరం జనవరి ఒకటిన నమ్మాళ్వార్ పరమ పద మహోత్సవం,14వ తేదీన గోదాదేవి కళ్యాణం,16న కరినోమును నిర్వహించనున్నామని వారు తెలిపారు.వేలాది మంది భక్తులు వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో పాల్గొంటున్నందున జిహెచ్‌ఎంసి,పోలీస్ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు.

## ఐకమత్యంను పెంపొందించేవి పండుగలు

**రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** మనుషుల మధ్య ఎటువంటి భేదాలు లేకుండా ఐకమత్యంను పెంపొందించటమే పండుగల ప్రధాన ఉద్దేశ్యమని తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని, మంగళవారం కవాడిగూడలోని ఇంగ్లీష్‌యూనియన్ హైస్కూల్ నందు ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ వేషధారణలతో పాటు, కేక్ కట్‌చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్సు ప్రదర్శనలో ఆకట్టుకున్న మీరాలం కేబుల్ బ్రిడ్జి నమూనా


సైన్సు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన మీరాలం కేబుల్ బ్రిడ్జి నమూనా

**చార్మినార్,డిసెంబరు 23 ప్రభాతవార్త :** పాతబస్తీ హాసన్‌నగర్‌లోని ఎంఎస్ మిషన్ హైస్కూల్ బాలికల బ్లాకులో మంగళవారం సైన్స్ అండ్ రోబోటిక్స్ ఎక్స్‌పోలో భాగంగా హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రూపొందించిన మీరాలం కేబుల్ బ్రిడ్జి నమూనాను సైన్సు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఫ్యూచర్ స్టిక్ కేబుల్ బ్రిడ్జి నమూనాను ముఖీముద్దీన్, మదీహా షౌకత్‌లు ప్రారంభించారు.బ్రిడ్జి వల్ల ట్రాఫిక్ సమస్య తగ్గటంతో పాటు పాతబస్తీతో సంబంధాలు మెరుగుపడతాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎఐఐటి అధ్యక్షులు మహమూద్ అలీ సోహైల్,మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్,ఫ్యాకల్టీ అస్మాతో పాటు పలువురు పాల్గొన్నారు.కాగా మీరాలం కేబుల్ బ్రిడ్జి నమూనాతో పాటు విద్యార్థులు రూపొందించిన పలు రకాల సైన్సు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## సిపిఆర్,బిఎల్ఎస్‌పై మరింత అవగాహన కల్పిస్తాం

**-టీజీఎస్‌పీఎఫ్ కమాండెంట్ జంగయ్య**


బేగంపేట విమానాశ్రయంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు.

**బేగంపేట డిశంబరు 23,ప్రభాతవార్త** అన్ని ముఖ్య శాఖల్లోని సిబ్బందికి సిపీఆర్, బీఎల్ఎస్‌పై అవగాహన కల్పిస్తామని టీజీఎస్‌పీఎఫ్ కమాండెంట్ సీ.జంగయ్య అన్నారు. తెలంగాణా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరక్టర్ జనరల్ స్వాతి లక్రా ఆదేశాల మేరకు టీజీఎస్‌పీఎఫ్ కమాండెంట్ సి.జంగయ్య వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, అసెంబీ,విమానాశ్రయంలలో సీపీఆర్,బీఎల్ఎస్ పై అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో అవగాహన కల్పించారు.మంగళవారం బేగంపేట విమానాశ్రయం లో అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కమాండెంట్ జంగయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు.ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగం అన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ డి.మహేందర్, సబ్ ఇన్స్‌పెక్టర్లు మల్లేష్,బివిజి రాజు.కృష్ణారెడ్డి, శ్రీని వాసరెడ్డి,ఏ.వి.రమణ,ఎండీ షఫీయుద్దీన్,సిబ్బంది పాల్గొన్నారు.

## పరిపాలనాదక్షుడు ప్రకాశం పంతులు

**-బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు**

**నాంపల్లి, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ప్రకాశం ఇన్‌స్టిట్యూట్ డెవలప్‌మెంట్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య ప్రధాన పోషకుడిగా పాల్గొన్న బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రర్‌రావు టంగుటూరి ప్రకాశం పంతులు సుపరిపాలనాదక్షుడని, ఆయ గొప్పదనాన్ని కొనియాడారు. ఈ సంస్థ చేస్తున్న పలుసేవా కృషికి ప్రతిఒక్కరినీ అభినందించారు. తాను తనవంతు సంపూర్ణ తోడ్పాటు అందిస్తానని భరోసానిచ్చారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ సి.మోహన్‌రావు, వైస్‌ఛైర్మన్ నరసింహారావు, సి.వి.రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్, కార్యదర్శి నిరంజన్, కోశాధికారి హనుమంతరావు, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకిషన్‌రావు, వాణిప్రదీప్, సహ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు రంగనాథ్, టీ.వి.రావు, ఫణిభూషణ్, సి.మోహన్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. టి.శ్రీరాం మాట్లాడుతూ తమ సంస్థ కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని, రాబోయే రోజుల్లో పంచాయతీరాజ్‌శాఖ, గ్రామ స్వరాజ్యం సుపరిపాలన వంటి కార్యక్రమాలు సంస్థ చేపట్టబోతుందని తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
మల్కాజిగిరి సర్కిల్-28
GHMC

NIT No. 55/EE-28/SBZ/GHMC/2025-2026

పని యొక్క పేరు: నిర్వహణ పనులు ఇతరములు-01. అంచనా మొత్తం (రూ. లక్షలలో): 31.50. బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం/ బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 23.12.2025 మ.12.30గం. 30-12-2025 మ.12.30గం. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, 7331189186. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం. 28, GHMC.

DIPR.NO.12547-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 23.12.2025



తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం.54. పనిపేరు : GHMC, రాజేంద్రనగర్ సర్కిల్-11లో RCC పైప్ డ్రైన్ వేయుట మరియు వరద నీటి డ్రైన్‌లు, మరియు BT రోడ్లు. సిసి రోడ్‌లు యొక్క నిర్వహణ యొక్క 7నం. పనుల కొరకు. అంచనా మొత్తం/ECV: రూ.89.05 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది, సమయం, తేది: 23.12.2025 మ.2.30గం. వద్ద. బిడ్ స్వీకరణకు చివరి తేది, సమయం : తేది: 30.12.2025 మ.2.45గం. వద్ద. EE/SE పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నం.11, GHMC. సెల్ నం: 9989930608. ఇ-మెయిల్ id-eec11.ghmc2@gmail.com.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (RJNR) GHMC.

DIPR.NO. 12552-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 23.12.2025



IN THE COURT OF THE HON'BLE XVIII. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT: AT HYDERABAD
O.S.NO.: 1605 OF 2025

Between:
1.Pottekula Uma D/o.late Akkulappa, Age 57 years, Occ: Housewife, R/0.6-1-338, Dr.S.K. Vyadhi Nivarana Ashram, Sai Baba Temple, Padma Rao Nagar, Secunderabad
2.Pottekula Padmaja, W/o.late G. Satyanarayana, Age 57 years, Occ: Housewife, R/o.Plot No.53, 54, H.No.3-7-15, Sri Sai Nagar Colony, Mansoorabad, L.B Nagar, Hyderabad-68
3.Dr. Pottekula Sreedevi W/o. B.Janardhan, Age 52 years, Occ: Doctor, R/o.Plot No.38 H.No.5-3-747/5, Vijayapuri Colony, Phase-1, Vanasthalipuram, Hayathnagar, R.R.Dist.,
4. Pottekula Venugopal, S/o. late Akkulappa, Age 51 years, Occ: Nil R/o H.No. 22-1-272, Sultanpura, Chadarghat, Hyderabad
5.Chevikala Shanthi W/o.late C.Venkata ramana, Age 51years Occ: Housewife, R/o.Plot No.184, St. No.8, Saheb Nagar, Vijayapuri Colony, Hayathnagar R.R.Dist.,
...Plaintiffs
AND
1. The Tahsildar, Bhaudurpura, Hyderabad
2.All Concerned
...Defendants

Please take notice that the above Plaintiffs had filed the case for declaration to declare the plaintiff as the legal heir of late Pottekula Akkulappa, and Pottekula Sarojini against Defendant No.2 and Hon'ble Court directed all concerned to appear in person or through advocate on 3-2-2026 at 10.30 a.m and if failed to do so will be set ex-party and matter will be decided according to law and procedure. Schedule property: All that Premises bearing municipal No. 22-2-272, admeasuring 232 SQ YDS, or 193.98 SQ MTS an old constructed house with mud walls country tiled roof situated at Kalikhabar Chaderghat, Hyderabad. EAST: Lane 11ft.wide. WEST; House of Sri Jalelmuzafar. NORTH: House of Sri D.Narayana Rao. SOUTH: House of Sri Pandurangam.

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- P.V.Ramana Murty
Advocate
H.No 3-7-6, Sri Sai Nagar Colony, Mansoorabad, L.B Nagar, Hyderabad-68
Cell No: 9391008850
Counsel for the Plaintiff



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE: RANGA REDDY DISTRICT: AT: L.B NAGAR
G.W.O.P. No. 78 OF 2025

Between:
Kunusothu Swarupa
... Petitioner
AND
Rathlavath Babulal & All Concerned
... Respondents

PUBLIC NOTICE

To,
THE ALL CONCERNED
...Respondent No.2

Please take the notice that the petitioner has filed the above G.W.O.P for seeking the permission of the Hon'ble court to permit the petitioner being the natural mother and guardian of the two minor children. Kum. Kunusothu Manogna, aged 16 years (date of birth: 31-01-2010) and a minor son Master. Kunusothu Ranveer aged 13 years (date of birth: 26-07-2013), to alienate the petition schedule properties on their behalf of to any third parties for the welfare of her two children, as her husband Late. Kunusothu Veeranna died on 29-11-2018 by leaving the petitioner as his wife and the two minor children behind him, and the matter is posted on dated 29-12-2025 for appearance of the parties, if any having objections/claims, hence, it is directed to appear before this Hon'ble Court on dated 29-12-2025 at 10.30 am, failing which the matter will be decided on the merits of the case.

PETITION SCHEDULE OF PROPERTY-I
SCHEDULE –A PROPERTY
All that the premises bearing H.No.8-3-825/3/1 & 8-3-825/4 admeasuring 300 Sq.Yds., or 250.80 Sq. Mts., situated at Yellareddyguda, Hyderabad, A.P. (Telangana) and bounded as under: NORTH :: Neighbours Property, SOUTH :: 30 Feet Wide Road, EAST :: 6 Feet Lane & Neighbours Property, WEST :: Neighbours Property.
SCHEDULE –B PROPERTY
All that the flat No.302 (old No.4B) in third floor, having a super built up area of 1114 Sft.,(Including common area) along with undivided share of land 27 Sq Yards., in premises Nos. 8-3-825/3/1 & 8-3-825/4 in the building complex known as "PADMAVATHI PLAZA", situated at Yellareddyguda, Hyderabad, Telangana, bearing Registered Sale Deed Document No.1914 of 2011 dated 24-06-2011 registered at District Registrar- Hyderabad South, and is bounded by: NORTH :: Open to Sky, SOUTH :: Open to Sky, EAST :: Open to Sky, WEST :: Passage, Staircase & Flat No.301 (Old No.4A)
PETITION SCHEDULE OF PROPERTY-II
All that the Open House Plot in Survey No.331 Part (Minjumale), admeasuring 339 Sq.Yards or 283.45 Sq. Mtrs, which is situated to the west of side and nearest to the H.No.18-247/1, situated at: in Grampanchayathi Ward No.18, Grampanchayathi: Narsampeta, Revenue village: Narsampeta, Mandala Parishathu: Narsampeta, Jilla Parishathu: Warangal, Under the Warangal District Registrar, Narsampeta Sub-Registrar, vide Registered Sale Deed No. 10/2008, dated 03-01-2008, and is bounded by: NORTH :: Proposal Road, SOUTH :: Open place of Yennamsetty Srinivasarao, EAST :: Open place of Indrareddy (Nearest to H.No.18-247/1), WEST :: Open place of Majjiga Murali
Measurements of the Concern Open House Plot
NORTH :: 43 Feets 9 Inches equivalent 13.34 Meters,
SOUTH :: 43 Feets 9 Inches equivalent 13.34 Meters,
EAST :: 69 Feets 9 Inches equivalent 21.26 Meters,
WEST :: 69 Feets 6 Inches equivalent 21.18 Meters.

// BY THE ORDER OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, R.R DISTRICT //
Sd/- M/s. BALLA RATNA KUMAR
ADVOCATE
Counsel for the petitioner.
Cell: 8919777636



IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, R.R.DISTRICT AT : HAYATHNAGAR
O.S.No. 1096 OF 2025

Between:
Guntha Venkata Shetty and another
...PLAINTIFFS
AND
All Concerned and another
...DEFENDANTS

To,
All Concerned.
.... DEFENDANT No.1

It is hereby informed the General Public that, the Plaintiff's filed the above suit to declare them as the legal heirs of LateGunta Shantha @ Guntha Shanthamma W/o. Guntha Venkata Shetty,who was died intestate on 11-09-2024, and also to declare them as owners of below mentioned schedule properties and the same is posted on 22-01-2026. If any person is having any objections they may appear before the court either in person or through an advocate or else the Hon'ble court may pass appropriate orders.

\\ By the order of the court//
SUIT SCHEDULE A PROPERTY
All that open plot bearing No. 22 admeasuring 200 Sq Yards in Sy No.405 Part, Situated at Torror Village, Previously Hayathnagar Revenue Mandal, now Abdullapurment Mandal, Ranga Reddy District, and Bounded by:- NORTH : Plot No.23. SOUTH : Plot No.21. EAST : 33 feet Wide Road. WEST : Plot No.48.
SUIT SCHEDULE B PROPERTY
All that open plot bearing No. 298 admeasuring 133 Sq Yards in Sy No's. 73,74, and 134, Situated at Abdullapur Village, Previously Hayathnagar Revenue Mandal, now Abdullapurment Mandal, Ranga Reddy District,, and Bounded by:- NORTH : Plot No.297. SOUTH : Plot No.45. EAST : 25 feet Wide Road. WEST : Plot No.46.

M/S. M.NIKHIL KUMAR
B.JAGAN MOHAN,
ADVOCATES,
R/o:, H.No.6-35,Kuntloor Colony, Hayathanar, R.R.District.T.S
Cell No. 738674545
Email. Mnikhiladvocate@gmail.com



IN THE COURT OF THE HON'BLE XXVI TH ADDITIONAL CHIEF JUDGE COURT, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No 598 OF 2025

BETWEEN:
1. Smt. Malikuppam Pasala Vasanthi W/o Late. M. P. Damodaram, Aged about 90 years, Occ: House Wife. R/o H. No. Plot No. 126. Road No. 74, Jubilee Hills, Shaikpet, Hyderabad, Telangana, 500 033.
2. Smt. Shyamala Sagar, W/o B. Krishna Sagar, Aged about 70 years, Occ: House Wife, R/o Flat No. 406, Quiescent Heights, Raheja Mind Space, Opp: Westin Hotel, Madhapur, K.V. Rangareddy, Telangana - 500 081.
3. Smt. Shashikala Yelamanchili Chowdary W/o Y. V. Rajendra Chowdary, Aged about 66 years, Occ: House Wife, R/o H. No. 8-2-293/82/J-111/126. Road No. 74. Shaikpet, Hyderabad,Telangana - 500 033.
...Plaintiffs No 1 to 3
And
1. MANDAL REVENUE OFFICER, Shaikpet.
2. MANDAL REVENUE OFFICER Asif Nagar, Hyderabad Dist.,
3. ALL CONCERNED
4. M.P.TEJ BABU S/o. Late M. P. Damodaram, Aged about 67 years, Occ: Business, R/o H.No. Plot No. 1313, Road No. 66, Jubilee Hills, Hyderabad-33.
5. Smt. Prasad Sarala Rajendra W/o C S. Rajendra Prasad, Aged about 72 years, Occ: House Wife, R/o H. No. Plot No. 1248, Road No. 62, Jubilee Hills, Shaikpet, Hyderabad, Telangana-500033, Presently R/o 1310 Alleyan Trail Sugar Land TX 77479 U.S.A.
6. Chief Manager, State Bank of India Collectarate Complex, H. No. 5-4-666, 1st Floor Peshawari Plaza, Kattal Mandi, Nampally, Hyderabad Branch Code: 21038
...Defendants Nol to 6

Take notice that, the Plaintiffs have filed the above suit for declaration of legal heirs of Late. M.P. Damodaram, before the Hon'ble XXVI TH Additional Chief Judge Court, City Civil Court at Hyderabad and if any person or persons has got any objections shall appear before the Hon'ble court on 22-01-2026 at 10-30 A.M. in person or through an advocate, otherwise the case will be decided in your absence.

"A" SCHEDULE OF PROPERTY:
All that the property bearing No's 10-2-289/79 and 10-2-289/79/1 admeasuring 700 Sq Yards and 24,000 sft constructed in Plot No 79 (old B/13) which is comprised of stilt plus 6 upper floors situated at circle No7 G.H.M.C. Shanti Nagar, Masabtank, Hyderabad which is bounded By: NORTH: Plot No. 13/14, SOUTH: Plot No B/12, EAST: Plot No B/6,WEST: 30 Road.
"B" SCHEDULE OF PROPERTY:
All that the property bearing Plot No101 situated in 'NIVANIRMAN' Colony, Road No. 71, Jubilee Hills, Hyderabad, Municipal Corporation, district Hyderabad Survey No403, Shaikpet Village Mandal admeasuring 220 Sq yards as bounded by: EAST: 30" Wide Road,WEST: Plot No98,SOUTH: Plot No 102, NORTH: Plot No 100.

(Published as per the orders of the Hon'ble Court)
Sd/-N.LAKSHMI NARAYANA
ADVOCATE
Flat No 103t 1st Floor
Leela Nagar, Ameerpet
Hyderabad-16,Cell:9959357863



IN THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II AT HYDERABAD
O.A. 786 of 2025

Between:
Bank of Baroda, Begumpet Branch Rep. by its Branch Manager Shri Ambati Ananda Kumar Address at 6-3-1218/2/8, Street no. 6, Plot No. 77, Uma Nagar, Kundanbagh, Begumpet, Hyderabad, Telangana - 500016 Ph No. +91 79933 16538, Email: begump@bankofbaroda.com ...Applicant
AND
1. Mrs. Kuchikulla Shravya D/o. Late Kuchikulla Ajay Kumar Reddy, C/o. Kuchikulla Sujatha Age: 33 Yrs, Gender: Fe-male, Occ: Software, H.No. 16-1-30/E, A.V Residency, Flat No. 201, Saidabad Colony, Hyderabad, Telangana - 500 059 Ph No. 9000729999, Email id: ayvarhs18@gmail.com
2. Smt. Kuchikulla Sujatha W/o. Late Kuchikulla Ajay Kumar Reddy Age: 62 Yrs, Gender:Fe-Male, Occ: House Wife, H No. 16-1-30/E, A.V Residency, Flat No. 504, Saidabad Colony, Hyderabad, Telangana - 500 059, Ph No. 8886364366
3. M/s. High Rise Constructions Rep by it's their Managing Partner Mr. A. Narsimha Reddy Office address at 11-13-1205/B, Plot No. 227, Road No. 9, Vasavi Colony, Kothapet, Saroornagar, Hyderabad - 500036, Ph No. 9140 40273666
4. Mr. A. Narsimha Reddy S/o. Late A Goverdhan Reddy, Age: 45 Yrs, Occ: Managing Director, Gender: Male, Address at Flat NO. 505, Hanuman Residency, Anand Nagar, Malakpet, Hyderabad - 500 036
...Defendant No. 1 to 4

Please take the summons in the above O.A. No. 824/2025 filed by the applicant for recovery of money of ₹ 66,98,411/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telegu daily newspaper and posted the matter to 16-02-2026.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i)To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii)You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv)You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and /or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v)You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 16-02-2026 at 10:30 a.m. at Debts Recovery Tribunal-I, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 23th day of December, 2025.

REGISTRAR
DEBTS RECOVERY TRIBUNAL-II
1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001



NOTICE TO DEFENDANT No.3/ALL CONCERNED IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE COURT AT: MEDCHAL
O.S. No. 173 OF 2025

BETWEEN:
1. Saroj Mittal & other
...Plaintiffs
And
1. The Tahsildhar & Others
...Defendants

To,
All concerned, Telangana.

SUMMONS

The General Public/All Concerned are hereby informed that the Plaintiffs in the above case have filed the suit for declaration to declare them that they are the only surviving Legal Heirs of Deceased Late Surender Mittal against all concerned. The above matter is posted to 20-01-2026. If any person having got any objection for declaring them as the only surviving Legal Heirs of Deceased Late Surender Mittal, he/she/they may enter their appearance personally or through duly instructed counsel on 20-01-2026at 10:30 am in the above designated court.
Therefore make it convenient to attend the court on the said date and time before the Hon'ble Court. In the event of your failure to appear before the designated court on the said date, matter will be heard and appropriate orders will be passed by the Hon'ble Court in accordance with law.

(BY ORDER OF THE COURT)
BANSAL & ASSOCIATES
Preethi Bansal
Advocate
Counsel for the Plaintiff
# 2-2-140 & 96, Adarsh Tower, Ranigunj, Sec-bad, T.S. - 500 003
Cell No:9701093197
Bansalassociates24@gmail.com

## సమస్యలపై కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి డిసెంబరు23,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్ గడ్డమీద ఉన్న సమస్యలపై కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కమ్యూనిటీ హాల్ కావాలని గుట్ట పైకి వాటర్ సమస్య ఉందని అలాగే డ్రైనేజీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహిన్ సలీం వాజిద్ లకం షాదుల్ మధు దీపక్ మనోజ్ వంశి చారి, అక్తర్ జయసింహ. నాగేష్ భరత్ బాలాజీ, తో పాటు కాంగ్రెస్ నాయకులు డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి బాబు సత్యనారాయణ సంపత్ రావు బ్రహ్మయ్య కిషోర్ అశోక్ పాల్గొన్నారు.

## పివి దేశానికి చేసిన సేవలు ఎనలేనివి : చౌకి రవికుమార్



పీవీ నరసింహారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబర్ 23, ప్రభాతవార్త:** దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలు ఎనలేనివని గ్రేటర్ హైదరాబాద్ ఓబిసి సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చౌకి రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత పివికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అజంపుర డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, నాయకులు రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**: ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి**



సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చాదర్ ఘాట్ ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి, చిత్రంలో ఎస్ఐ ఎలా కృష్ణ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి పేర్కొన్నారు. చార్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమల్ నగర్, మూసా నగర్ తదితర ప్రాంతాలలో సైబర్ నేరాలపై స్థానిక ప్రజలకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్ లో వచ్చే లింకులను, ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయవద్దని, ఓటీపీల గురించి ఎవరికీ చెప్పవద్దని పేర్కొన్నారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో సైబర్ నేరాలపై పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం ముమ్మరంగా పోలీస్ పహారాలను కొనసాగిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాయినగర్ కురుమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**నేరేడ్ మెట్, డిసెంబర్ 23,ప్రభాతవార్త :** శ్రీ సాయి నగర్ కురుమ సంఘం (సైనిక్‌పురి) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వగ్గు మల్లేష్ కురుమ, ఉపాధ్యక్షులుగా బండ శ్రీశైలం, వడ్డే పాండు, ప్రధాన కార్యదర్శిగా కె. ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా కె. ధనుంజయ్, ఎం. అనిల్, కోశాధికారిగా బండి నరసింహులు ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా బీరప్ప, రాజశేఖర్, నాగరాజు ఎంపికయ్యారు. సలహాదారులుగా జి. యాదగిరి కురుమ, వి. సత్తయ్య కురుమ, కె. పరంధాములు కురుమ, మురళి కృష్ణ కురుమలను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వగ్గు మల్లేష్ మాట్లాడుతూ, సంఘ అభివృద్ధికి సభ్యులందరి సహకారంతో చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. కురుమ సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేసి, సభ్యుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## సిపిఐ 100వ వార్షికోత్సవం ముగింపు కార్యక్రమానికి విరాళం



**తుర్కయంజాల్ డిసెంబర్ 23,ప్రభాతవార్త** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో 2025 డిసెంబర్ 26న నిర్వహించనున్న పార్టీ 100వ వార్షికోత్సవ కార్యక్రమాల సందర్భంగా, సీపీఐ పార్టీ శాఖ నిర్వహించిన వసంతుల ముగింపు ఉత్సవాలకు ..51,000/ (యాభై ఒక వేల రూపాయలు) విరాళంగా తుర్కయంజాల్ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య వారు సీపీఐ పార్టీ నాయకులకు కొంతం మాధవ రెడ్డి వారికి 51,000 వేల రూపాయలు అందజేశారు. అదేవిధంగా, మంచాల్ గ్రామంలో బీరప్ప స్వామి మరియు మహంకాళి దేవి నూతన దేవాలయాల నిర్మాణానికి సహకారంగా కురుమ సంఘానికి ..16,000/ (పదహారు వేల రూపాయలు) చందాగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాజీ అధ్యక్షుడు నల్లవెల్లి వెంకటేష్, హనుమంత్ గౌడ్, ఎండి షఫీ, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నవీన్ రెడ్డి, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా

**-అధికారుల తీరును నిరసిస్తూ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన ప్రజలు**



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రజలు

**హయత్ నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** అసంపూర్తి విస్తరణ పనులు.... ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం లేకపోవడంతో జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బిజేపీ రాష్ట్ర నాయకులు సామ రంగా రెడ్డి, హయత్ నగర్, మన్సురా బాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహ రెడ్డి మండి పడ్డారు. హయత్ నగర్లో ఇటీవల జరిగిన ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం పాలవడంతో ఆగ్రహించిన పలు కాలనీల వాసులు మంగళవారం జాతీయ రహదారిపై బైటాయించి ఆందో ళనకు దిగారు. దీంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని సముదాయించి పంపించివేశారు ఈ సంద్నర్భగా నాయకులు మాట్లాడుతూ...జాతీయ రహదారి విస్తరణ పనులు మధ్యలోనే నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భాగ్యలత నుండి హయత్ నగర్ వరకు ఎక్కడా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేకపోవడంతో రోడ్డు దాటే సమయంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే రోడ్డు దాటే క్రమంలో ఓ మెడికల్ విద్యార్థిని మృతి చెందడం బాధా కరమన్నారు. హయత్ నగర్, సూర్య నగర్ , ఆర్టీసీ కాలనీ, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికీ సర్వీస్ రోడ్లు పూర్తిగా నిర్మించకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సర్వీస్ రోడ్లకు ఆనుకుని ఉన్న కాలనీకు రోడ్లకు లింక్‌లు నిర్మించకపోవడం వల్ల వాహనాలు అకస్మాత్తుగా ప్రధాన రోడ్డుపైకి రావాల్సి వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలి కాలనీ రోడ్లను అనుసందానించాలిప్రజా అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్లు, సురక్షిత క్రాసింగ్ సదుపాయాలతో పాటు కాలనీ రోడ్లకు లింక్ రోడ్లు కూడా వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. హయత్ నగర్ ఇంజాపూర్ రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడం వల్ల వాహనదారులు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఉప్పల్‌లో 113 మందికి లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు : ఎమ్మెల్యే



ఉప్పల్‌లో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శ్రీవాణి, శాంతి, దేవేందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 113 మంది లబ్దిదారులకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, పన్నాల దేవేందర్‌రడెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లలకు తగు సహకారం అందిస్తున్నారని తెలిపారు. గతంలో సిఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా తులం బంగారం కూడా ఇవ్వాలని ఆయన కోరారు. పేద ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ డివిజన్‌లో 15 మందికి, నాచారం 15 మందికి, మల్లాపూర్ 17 మందికి, మీర్‌పేట 9 మందికి, చిలుకానగర్ 19 మందికి, హబ్సిగూడలో ముగ్గురికి, రామంతాపూర్‌లో 35 మందికి చెక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్ఐ అశ్వినిగౌడ్, వీరేంద్రసాయి, స్వర్ణలత, జూనియర్ అసిస్టెంట్ అనంతరాములు, సాయినాద్‌రెడ్డి, జిపిఓలు అలివేలు, వెంకన్న, వనిత, అటెండర్లు సత్యనారాయణ, స్వామి, సురేష్ పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## గండికోట శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరం



హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న గజ్జల మధుసూధన్‌రెడ్డి, గండికోట శ్రీనాథ్

**సైదాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** రక్తదానం ప్రాణదానంతో సమానమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జల మధుసూధన్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గండికోట శ్రీనాథ్ ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ శుభోదయ కాలనీలో, చంపాపేట వార్డు కార్యాలయం వద్ద ఉచిత మెగా హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. రెండు చోట్ల హెల్త్ క్యాంపులను ప్రారంభించిన అనంతరం గజ్జల మధుసూధన్‌రెడ్డి, గండికోట శ్రీనాథ్‌లు మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. ప్రతి ఒక్కరు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని కాన్సర్ బాధితులకు అందజేయడం జరుగుతుందని శ్రీనాథ్ తెలిపారు. రెండు చోట్ల ఉచిత వైద్య శిబిరాలకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బిపి, సుగర్, ఎల్‌ఫ్‌టి, టిఎఫ్‌టి, కెఎఫ్‌టి, ఎల్‌పి, ఆర్‌బిఎస్, దంత పరీక్షలు, కంటి వైద్య పరీక్షలు, కార్డియాలజి, ఇసిజి, టుడి ఎకో, స్కిన్ సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రక్తదాన శిబిరానికి స్థానికులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముదుపు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, సదానంద్ రెడ్డి, మల్లేష్‌గౌడ్, బొంబాయి, రోజారెడ్డి, వసంత, సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, రాజు, చందు యాదవ్, సత్తిరెడ్డి, శివ, జగదీష్, శ్రీను, నరేష్, వసంత్, రాజశేఖర్, మనోహర్ పాల్గొన్నారు.

## యుజిడి పనులు త్వరగా పూర్తి చేయాలి

**: కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి**



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ మూడుగుళ్ల వద్ద నూతనంగా చేపట్టిన యుజిడి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. యుజిడి పనులను మంగళవారం కార్పొరేటర్ అరుణ పర్యవేక్షించారు. అనంతరంనఆంధ్రా బ్యాంకు కాలనీలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంకు తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వండి



మేడిపల్లి ఎమ్మార్వో కృష్ణ చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు

**మేడిపల్లి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ సర్కిల్లో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో జరిగిన అవకతోకలపై పూర్తి విచారణ జరపాలని, అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని మేడిపల్లి ఎమ్మార్వోను కోరుతూ పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో కృష్ణ చైతన్య త్వరలోనే లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుభాష్ నాయక్, కో ఆప్షన్స్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బొడిగె కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



లింగోజిగూడ డివిజన్ సరూర్ నగర్ పోస్టాఫీసు సమీపంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు రావాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆహ్వానం అందజేస్తున్న లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

## చర్చికాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



రామంతాపూర్ చర్చికాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** రామంతాపూర్ చర్చికాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎం.పరమేశ్వర్‌రెడ్డి, జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, మున్సిపల్ డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్‌కుమార్, సాయితరుణ్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాగునీటి సమస్యల పరిష్కారం కోసం కొత్త పైపులైన్లను నిర్మించాలని సూచించారు. మంచినీటి సమస్య లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి కాలనీ అధ్యక్షులు జానీ, సుధాకర్, సతీష్, డేవిడ్, ప్రవీణ్ కుమార్, భాస్కర్, వినయ్, కిరణ్, రాజు, రాయన్న ,ఆరోగ్య మేరీ, ఇన్నశమ్మ, సుమలత, మేరీ లూర్దురెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, సందీప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ధర్నా



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విహెచ్‌పి, భజరంగ్‌దళ్, బిజెపి నేతలు

**ఉప్పల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ఉప్పల్‌లో మంగళవారం విహెచ్‌పి, భజరంగ్‌దళ్, బిజెపి ఆధ్వర్యంలో పలువురు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ చౌరస్తాలో బంగ్లాదేశ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో విహెచ్‌పి నేత రమేష్ నాయుడు, భజరంగ్‌దళ్ నేత సునీల్‌నాయక్, బిజెపి డివిజ న్ అధ్యక్షుడు మార్నెన ఫణీందర్, గడ్డం సాయికిరణ్, తిండేరు హనుమంత రావు, ఎనుముల మహేష్‌కుమార్, శామీర్‌పేట ధర్మారెడ్డి, వై.సత్యనారాయణ, గోనె శ్రీకాంత్, పుప్పాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. చంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి హత్య చేశారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం వెంటనే హిందువుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

## విద్యార్థులకు గణితం పై ఆసక్తి పెంపొందించడానికి కృషి : ప్రిన్సిపాల్ మల్లేష్ గౌడ్



ఎగ్జిబిషన్ లో విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ మల్లేష్ గౌడ్ అధ్యాపకులు తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో గణితం పై ఆసక్తి పెంపొందించడానికి కృషి చేస్తున్నామని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ప్రిన్సిపల్ గునిగంటి మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు. మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గాయత్రీ నగర్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ లో మ్యాథ్స్ ఎక్స్ పో(ఎగ్జిబిషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాథ్స్ ఎగ్జిబిషన్ లో విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. రామానుజన్ జీవిత విశేషాలు, ఆయన గణితంలో చేసిన పరిశోధనలు, సంఖ్యల పై ఆయనకున్న అపారమైన అవగాహన గురించి పాఠశాల విద్యార్థులు మోడల్స్, చార్ట్‌లు, పోస్టర్ల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు శ్యామల, మోనిక, స్వాతి, ఉపాధ్యాయులు సుందరి, శ్రీదేవి, ఝాన్సీలతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హెలెన్ కెల్లర్స్ విద్యాసంస్థల్లో క్రిస్మస్ వేడుకలు




**నేరేడ్‌మెట్, డిసెంబర్ 23,ప్రభాతవార్త :** హెలెన్ కెల్లర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం కటికనేని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శైలజ అసిస్టెంట్ ప్రొఫెసర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. విద్యార్థులు క్రిస్మస్ ఆటపాటలు, యేసుక్రీస్తు జననంపై నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన హెలెన్ కెల్లర్స్ విద్యాసంస్థలు అధినేత ఉమర్ ఖాన్, ఆయన సతీమణి ప్రమీల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాన్ మాట్లాడుతూ ప్రేమ, కరుణలే ప్రపంచ శాంతికి మూలమని అన్నారు. పాస్టర్ విజయ రాజు సృష్టి జననం, దేవుని ఆశీర్వాదాలపై సందేశం ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులకు భోజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం సమన్వయకర్త శైలజ నాయకత్వంలో విజయవంతంగా ముగిసింది. ఈ వేడుకలో డాక్టర్ ఆర్ముగం, డాక్టర్ శశిధర్ రెడ్డి, జాజుల అంజయ్య పాల్గొన్నారు

## అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



కార్పొరేటర్ లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్పస్వాములు

**వనస్థలిపురం. డిసెంబర్. 23. ప్రభాతవార్త.** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ అభయ ఆంజనేయస్వామి కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న నిత్యం అన్న ప్రసాద వితరణను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ మాజీ చైర్మన్ కొత్త శ్రీధర్ గౌడ్, ఎం. సురేష్ గౌడ్, గురుస్వాములు గడ్డం దాసు గౌడ్ తీ. మల్లేష్ యాదవ్, స్వాములు నీలా రాజ శేఖర్ గౌడ్. రామ్ బాబు గౌడ్, జగన్ గౌడ్, సైదులు, శివ, వర్షిత్ గౌడ్, సుకేష్ ,చారి రవి, విష్ణు బాలరాజు మరియు బిజెపి పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మహేష్ గౌడ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మరియు తదితరులు ఉన్నారు.

## సింగరేణి గుడిసెవాసులకు ఉన్న చోటే పట్టాలు ఇవ్వాలి : జెఏసి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్ నాయక్

**సైదాబాద్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** సైదాబాద్ మండల పరిధిలోని సింగరేణి కాలనీలో గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలకు గుడిసెలు ఉన్న స్థలంలోనే పట్టాలు మంజూరు చేయాలని సింగరేణి కాలని జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జెఏసి నాయకులు కొర్ర మోతిలాల్ నాయక్, మెగావత్ తుకారం నాయక్, విక్రం గౌడ్‌లు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సింగరేణి గుడిసెల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన పేద ప్రజలు నివసిస్తున్నారని, వీరికి ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఉన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు గుడిసెవాసులకు ఉన్న చోటే పట్టాలు ఇస్తామని హామీలు ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. అయితే గత కొద్ది రోజులుగా ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ సభ్యులు కొంతమంది గుడిసెవాసులకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తమకు ప్రత్యామ్నాయం అవసరం లేదని, ఉన్న చోటే పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జెఏసి ఆధ్వర్యంలో త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి గుడిసెవాసులకు ఉన్న చోటే పట్టాలు ఇవ్వాలని కోరుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సక్రిభాయి, సద్దాం ఖాన్, షేక్ మహమూద్, జంగయ్య, విజయ్, గణేష్ నాయక్, నాగు నాయక్, శాంతి భాయి, సుకుర్ పాషా, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర స్థాయి యుబిఎస్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని అండర్ జి-8 కేటగిరీలో పతకాన్ని సాధించిన బడంగ్‌పేట్ సర్కిల్ లోని శ్రీ గాయత్రీ స్కూల్ విద్యార్థిని డి.తస్వీకా ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## ఉపాధి హామీ పథకంపై కేంద్రం కుట్రను తిప్పికొట్టండి




నిరసన ప్రదర్శనలో నాయకులు

**హయత్‌నగర్, డిసెంబర్ 23 ప్రభాతవార్త :** జీ రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్య లో హయత్ నగర్ లో మంగళవారం నిర్వహించిన నిరసన దీక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.... వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో వలసలు , పేదరికం నిర్మూలించబడ్డాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేద ,మధ్యతరగతి ప్రజలకు సంవత్సరంలో వంద రోజులు పని కల్పించడం జరిగిందన్నారు. ఇలాంటి పథకానికి నిధులు కేటాయించకుండా పేరు మారుస్తూ... పథకాన్ని ఎత్తి వేసేందుకు బిజెపి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మహాత్మా గాంధి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుట కొరకు ప్రజలంతా సమైక్యంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ హయత్ నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

## సర్వీసు రోడ్డుకు అనుమతి ఇవ్వండి : రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి డిసెంబరు23,ప్రభాతవార్త :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ ప్రజలకు 100 ఫీట్ల రోడ్డు కు సర్వీసు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రు నగర్ లో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ తో పాటు రైల్వే, జిహెచ్ఎంసి ప్రాజెక్టు అధికారులతో ఆయన 100 ఫీట్ల రోడ్డు కు ఇందిరా నెహ్రూ నగర్ ప్రజలకు సర్వీసు రోడ్డుకు అనుమతి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉత్తంనగర్ నుండి 100 ఫీట్ల రోడ్డు వయా ఇందిరా నెహ్రు నగర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నిర్మాణం ఉందని ఈ 100 ఫీట్ల రోడ్డుకు ఇందిరా నెహ్రూ నగర్ మరియు ఇతర కాలనీల ప్రజలకు సర్వీసు రోడ్డు కోసం ఆయన మ్యాపును పరిశీలించారు. ఈ కార్య క్రమంలో రైల్వే, జిహెచ్ఎంసి ప్రాజెక్టు అధికారులతో పాటు స్థానిక నాయకులు జేపీసీ వెంకన్న బైరు అనిల్ సీది రాములు కాటంరాజు రామచర్ల నర్సింగ్, మర్రి శీను, కిట్టు, నగేష్ గౌడ్, నర్సింగ్ రావు, అనిత భాను కావాలి శ్రీనివాస్ ఉన్నారు.

## ప్రజల మన్నలను పొందాలి: తీగల కృష్ణారెడ్డి



మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన దృశ్యం

**సరూర్‌నగర్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు గ్రామాల్లో అందుబాటులో ఉండి అభివృద్ధి చేయాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా, ఉప సర్పంచ్‌లుగా ఎన్నికైన పలువురు మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యేను కలిసారు. మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ క్యాంపు ఆఫీస్‌కు తరలివచ్చిన వారు తీగలను శాలువాలతో మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చూడాలని అన్నారు. సమస్యలను తీరుస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందాలని తీగల దిశానిర్దేశనం చేశారు.

## విజ్ఞానపురి కాలనీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




సెమీ క్రిస్మస్ సంబరాల్లో ప్రసంగిస్తున్న టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్ పరిధి విజ్ఞానపురి కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టియుఎఫ్ఐడిసి చైర్మన్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవ కుటుంబాలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సల్మాన్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, గౌరవాధ్యక్షుడు మంగారెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్‌ఒడ్డిలతో పాటు భాస్కర్‌రావు, సురేందర్‌రావు, అబ్బయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని చాణక్యపురి అయ్యప్ప దేవాలయంలో సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న మైసం పల్లి శివాంకు బాబు ,సంతోష్ రాందాస్, ముదిరాజ్, కన్నా, యాదగిరి, శోభన్ ముదిరాజ్, రాజు శ్రీధర్ సాయి సురేష్ సింగ్ ఇస్త్రారీ, తదితరులు పాల్గొన్నారు